www.bhadradrinews.com

# భద్రాద్రి న్యూస్

తెలుగు దినపత్రిక

Bhadradrinews Telugu Daily

హైదరాబాద్, సంపుటి : 4 సంచిక: 204, మంగళవారం 25-8-2026 ఎడిటర్ : చెంగపాంగు సైదులు పేజీలు : 6 వేల : 5

Published from Khammam,Circulated by Hyderabad, Karimnagar, adilabad, Nizamabad, Warangal, Nalgonda, Mahabubnagar, Khammam

గిరిజన హక్కుల సాధనే లక్ష్యం



3 లో..




5వ పేజీల్లో

## పాలన చేతగాని బాబు... విపక్ష పాత్ర పోషించలేని అసమర్థుడు జగన్



సెప్టెంబర్ లో నూతన పార్టీ స్థాపించబోతున్నట్లు వెల్లడించిన విజయ సాయి రెడ్డి

ఉత్తరాంధ్ర ఆగస్టు 24 :

తాను కొత్త పార్టీని ప్రారంభించపోతున్నట్లు మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ విషయానికి సంబంధించి ఆయన సోమవారం ..మిగతా 2లో

## మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉప రాష్ట్రపతి



విదేశీ హైబ్రిడ్ విత్తనాల వాడకాన్ని తగ్గించుకోవాలి 2

రైతులకు సూచించిన ఉపరాష్ట్రపతి

## ఎవ్వరికైనా 100 శాతం న్యాయం చేయలేం

70 శాతం పదవులు పాత నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ

సోషల్ మీడియాతో బతికేస్తున్న కెటిఆర్ : పిసిసి చీఫ్



మెదక్ ఆగస్ట్ 24 :

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖ స్పందించిన తీరు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో ..మిగతా 2లో

## నా పర్యటనలో... దాపరికం లేదు

### నన్ను అడ్డుకున్నా..నా లక్ష్యాన్ని అడ్డుకోలేరు

రాజకీయ కారణాలతో పర్యటనను అడ్డుకున్న విదేశాంగ శాఖ అధికారులు బిజెపిలో చేరితే మంచిది

నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలను అవమానించిన కేంద్రం

దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్న ప్రధాని

పెట్టుబడులన్నీ గుజరాత్ కే రావాలని అత్యాశ

సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా ప్రధాని వ్యవహారం

పార్లమెంటులో కాంగ్రెస్ ఖచ్చితంగా నిలదీస్తుంది

మీడియా సమావేశంలో సిఎం రేవంత్ మండిపాటు



హైదరాబాద్ ఆగస్ట్24 :

పెట్టుబడుల సాధన కోసమే విదేశీ పర్యటనకు సంకల్పించామని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. అయితే, దురుద్దేశపూర్వకంగా తన అమెరికా పర్యటనను కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరించాలనేదే సమాఖ్య స్ఫూర్తి అని తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా కేంద్ర విధానాలు ఉన్నాయని అన్నారు. వికసిత్ భారత్ 2047లో భాగంగా తెలంగాణ రైజింగ్ 2047ను ప్రకటించామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. లండన్ నుంచి తిరిగి వచ్చిన తరవాత సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ ట్రిలియన్ డాలర్ల ఎకానమీ తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. విదేశీ పెట్టుబడుల ఆకర్షణ ద్వారా తెలంగాణ ఆర్థిక పురోభివృద్ధి దిశగా వెళ్లాలనేదే తమ యోచన అని పేర్కొన్నారు. మోదీ ఇంకా గుజరాత్ ముఖ్యమంత్రి లానే వ్యవహరిస్తున్నారని.. దేశానికి ప్రధాన మంత్రిగా వ్యవహరించడం లేదని సీఎం విమర్శించారు. గుజరాత్ నేతలు తెలంగాణ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విరుచుకుపడ్డారు. గుజరాత్ ఆధిపత్యానికి ఇదే నిదర్శనమని చెపకొచ్చారు.గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తెలంగాణ సీఎం పర్యటనకు నిరాకరించడం ..మిగతా 2లో

## ష్... ఆమె గురించి మాట్లాడకండి

2



కొండా సురేఖ వ్యవహారం అధిష్టానం చూసుకుంటుంది

ఇందులో ఎవ్వరు కూడా ఇక మాట్లాడొద్దు



## మంత్రిగా కొండా సురేఖకు కౌంట్‌డౌన్ స్టార్ట్?

### అటవిశాఖలో డిప్యూటేషన్ల రద్దు

డిప్యూటేషన్‌పై ఉన్న అధికారులు పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు

హైదరాబాద్ ఆగస్టు 24 :

రాష్ట్ర ప్రభుత్వం అటవిశాఖ మంత్రి కొండా సురేఖ కు చెక్ పెట్టింది. ఆమెకు తెలియకుండానే పలువురు ఐఎఫ్ఎస్ అధికారులు, ఇతర ఉన్నతాధికారుల డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రిపై కొండా సురేఖ కూతురు సుస్మిత చేసిన అనుచిత వ్యాఖ్యలు కొన్ని రోజులుగా రాజకీయాల్లో చర్చాంశనీయంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల నుంచి సోమవారం ఉదయం తిరిగి వచ్చిన తరువాత వరుస భేటీల అనంతరం సాయంత్రం మీడియా సమావేశంలో తన అమెరికా పర్యటన రద్దుపై కేంద్ర బీజేపీ ప్రభుత్వం చేసిన ఆటంకాలపై విరుచుకు పడ్డారు. అనంతరం కొండా సురేఖ అంశాన్ని విలేకరులు ప్రస్తావించగా క్రమ శిక్షణ కమిటీ అన్నింటిని పరిశీలించి నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించిన గంట వ్యవధిలోనే కొండా సురేఖ శాఖల్లో ముఖ్యమైన అటవిశాఖలో డిప్యూటేషన్ల రద్దు సంచలనంగా మారింది . డిప్యూటేషన్‌పై ఉన్న అధికారులను పీసీసీఎఫ్ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అది కూడా ఆమెకు తెలియకుండానే ఉత్తర్వులు వెలువడడంతో ఆమెకు పొమ్మన లేక పొగబెడుతున్నారని సర్వత్రా ఆరోపణలు వినిపిస్తున్నాయి.



## అంతర్జాతీయ న్యాయ సేవలకు హైదరాబాద్ వేదిక

ఏఐ ఆధారిత కేంద్రం ద్వారా వివిధ దేశాల న్యాయ నిపుణుల సేవలకు అవకాశం

కావేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్'ను ప్రారంభించిన భట్టి

హైదరాబాద్ ఆగస్టు 24 :

అంతర్జాతీయ న్యాయ నైపుణ్యాన్ని కృత్రిమ మేధ సాంకేతికతతో అనుసంధానం చేస్తూ, వివిధ దేశాలకు సంబంధించిన న్యాయ సేవలను మరింత సులభంగా అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన 'కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్' హైదరాబాద్ కార్యాలయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ న్యాయ సేవలకు సంబంధించిన వినూత్న సంస్థ హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వృత్తిపరమైన సేవలతో సహా అనేక రంగాల్లో కృత్రిమ మేధ వినియోగం వేగంగా విస్తరిస్తోందని, ఇది అపారమైన అవకాశాలను సృష్టిస్తూనే కొత్త సవాళ్లను కూడా ముందుకు తెస్తోందన్నారు. అందువల్ల ఏఐ వినియోగంలో బాధ్యత, నైతిక విలువలు, పారదర్శకత అత్యంత కీలకమని పేర్కొన్నారు.బలమైన ఐటీ, సాంకేతిక వ్యవస్థ, అత్యున్నత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, ..మిగతా 2లో

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో... పంటలకు విలువ జోడిద్దాం



అంతర్జాతీయ మార్కెట్లకు మన వ్యవసాయ ఉత్పత్తులు

ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ, కోస్తా కోకో గ్లోబల్ బ్రాండ్లుగా మారాలి

దేశీయ రకం హైబ్రీడ్ పాప్ కార్న్ మొక్కజొన్న విత్తనాలు విడుదల

ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌తో పాల్గొన్న చంద్రబాబు

నూజివీడు ఆగస్టు 24 :

మన రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెసింగ్ చేసి విలువ జోడించే ..మిగతా 2లో



## దివ్యాంగులకు మినహా.... కళ్యాణలక్ష్మిపై కొనసాగుతున్న స్టే

హైదరాబాద్ ఆగస్ట్24 :

తెలంగాణ హైకోర్టులో రాష్ట్ర ప్రభుత్వానికి స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద దివ్యాంగ వధువులకు ..మిగతా 2లో

## నాపై నిఘా పెట్టారా..

### డీజీపీ సీవీ ఆనంద్‌కు ఎంపీ ధర్మపురి అర్వింద్ సంచలన లేఖ

హైదరాబాద్ ఆగస్టు 24:

తెలంగాణ బీజేపీ కీలక నేత, ఎంపీ ధర్మపురి అర్వింద్ డీజీపీకి సంచలన లేఖ రాశారు. తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సోదరుడి ఆదేశాల మేరకు తన కదలికలపై నిఘా ఉంచేందుకు ఒక ఏసీపీ స్థాయి పోలీసు అధికారిని నియమించినట్లు తెలిసిందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను ఉద్దేశించి ఆయన ఎక్స్ మాధ్యమం ద్వారా లేఖ రాశారు. డీజీపీని సమర్థుడైన అధికారిగా ..మిగతా 2లో






## సెప్టెంబర్ 5న... ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ నిరసన మార్చ్

2

కేంద్రం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో విఫలం

# నా పర్యటనలో... దాపరికం లేదు

4కోట్ల తెలంగాణ ప్రజలకు జరిగిన అవమానం అన్నారు. ఇది స్పష్టమైన రాజకీయ వివక్ష, రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమేనన్నారు. వైబ్రెంట్ గుజరాత్ పేరుతో ఆ రాష్ట్ర సీఎం అమెరికాలో ర్యాలీలు చేశారని, పెట్టుబడుల కోసం ఎనిమిది రోజులు అక్కడ పర్యటించిన విషయాన్ని ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు. గుజరాత్ సీఎంకు అనుమతి ఇచ్చి.. తమ పర్యటనను ఎందుకు అడ్డుకున్నారో కేంద్రం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్రం పదే పదే తెలంగాణ వ్యతిరేక భావజాలాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులను గుజరాత్‌కు మళ్లించుకొనేందుకు కుట్రలు చేశారంటూ మండిపడ్డారు. టీబీజేపీ నేతలు వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్నారని సీఎం మండిపడ్డారు. విచక్షణ కోల్పోయి ప్రభుత్వం, తన అధికారిక పర్యటనలపై బీజేపీ నేతలు ఇష్టానుసారం మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. బీజేపీ నేతలపై ఆరోపణలు చేయదలచుకోలేదని.. ఎందుకంటే వారికి ఆ స్థాయి లేదంటూ వ్యాఖ్యానించారు. పెట్టుబడుల సాధన కోసం గతంలోనూ విదేశీ పర్యటనకు వెళ్లామని వివరించారు. ఢిల్లీలో ఉన్న కొందరు బీజేపీ నేతలు కేంద్రాన్ని తపదోవ పట్టించారని ఆరోపించారు. తన అధికారిక పర్యటనపై కేంద్రానికి అవాస్తవాలు చెప్పారని మండిపడ్డారు. 'మేము ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళు తున్నాం. నా పర్యటన పూర్తి వివరాలు కేంద్రానికి ఇచ్చాం. విద్య, క్రీడల్లో విదేశీ పెట్టుబడులను ఆకర్షించాలని సంకల్పించాం. అమెరికా పర్యటనలో ప్రఖ్యాత యూనివర్సిటీలు, పెట్టుబడిదారులను కలుస్తామని కేంద్రానికి చెప్పాం. రాజకీయ కారణాల వల్ల అనుమతి నిరాకరిస్తున్నట్లు కేంద్ర విదేశాంగశాఖ మాకు బదులిచ్చిందని అన్నారు. అందుకే ఇంగ్లండ్ పర్యటనకు అనుమతి ఇచ్చారు. అమెరికా పర్యటనను ఎందుకు తిరస్కరించారని ప్రశ్నించారు. గుజరాత్ సీఎంకి అమెరికా, కెనడా పర్యటనలకు అనుమతిచ్చారు. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణ ప్రజలను అవమానించడమే. తిరస్కరణకు రాజకీయ కారణాలు చెబుతున్నారంటూ ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. టీబీజేపీ ఎంపీలు గుజరాత్‌ను సపోర్ట్ చేస్తున్నారా టీబీజేపీ ఎంపీలకు తెలంగాణ అభివృద్ధి అవసరం లేదా అని ప్రశ్నించారు. 'నా పర్యటనను అడ్డుకోవడమంటే.. తెలంగాణ అభివృద్ధిని అడ్డుకోవడమే. నా పర్యటనను అడ్డుకోవడం తెలంగాణపై వివక్ష చూపించడమే. నా పర్యటనను అడ్డుకున్నారు.. మా లక్ష్యాలను అడ్డుకోలేరు. నాది చాటుమాటు పర్యటన కాదు.. అధికారిక పర్యటన. విదేశాల్లో ఉండగా స్పందిస్తే దేశద్రోహి అనేవారు. అందుకే ఇక్కడికి వచ్చి కేంద్రం వైఖరిపై మాట్లాడుతున్నా, ఏ విదేశీ పర్యటన అయినా భారత ఎంబసీ పర్యవేక్షిస్తుంది.

## నాపై నిఘా పెట్టారా..

మొదటి పేజీ తరువాయి...

ఎన్నో దశాబ్దాలుగా తాను గౌరవిస్తున్నానని పేర్కొన్న ఎంపీ, ఒక ముఖ్యమంత్రి కుటుంబ సభ్యుడి ఆదేశాల మేరకు పోలీసు వ్యవస్థ ఇలా వ్యవహరించడం తీవ్ర అభ్యంతరకరమని ఎంపీ ధర్మపురి మండిపడ్డారు. తెలంగాణ పోలీసు వ్యవస్థ భారత రాజ్యాంగం, చట్టబద్ధమైన అధికార పరిధి (లాఫుల్ చైన్ ఆఫ్ కమాండ్) ప్రకారం పనిచేస్తోందా లేక సీఎం కుటుంబ సభ్యుల ఆదేశాలతో నడుస్తోందా అని ఎంపీ అర్విండ్ తన ట్వీట్ లో డీజీపీని సూటిగా ప్రశ్నించారు. పోలీసు శాఖ కేవలం రాజ్యాంగానికి, చట్టానికి మాత్రమే జవాబుదారీగా ఉండాలని, ఏ ఒక్క రాజకీయ కుటుంబానికి కాదని ఆయన స్పష్టం చేశారు. దీంతో ప్రజాప్రతినిధులపై అక్రమ నిఘా ఆరోపణలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

## సెప్టెంబర్ 5న... ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ నిరసన మార్చ్

న్యూఢిల్లీ ఆగస్టు 24 :

సెప్టెంబర్ 5న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసన మార్చ్ యువతకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్ 5న దేశ రాజధాని న్యూఢిల్లీలో శాంతియుత నిరసన ర్యాలీకి పిలుపునిచ్చింది. జూలై 25న కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాల ఆధారంగానే అప్పట్లో దేశవ్యాప్తంగా చేపట్టిన యువజన ఆందోళనలను తాము సద్భావనతో విరమించామని, అయితే ప్రభుత్వం ఆ కట్టుబాట్లను అమలు చేయకుండా మోసం చేసిందని పార్టీ నేతలు విమర్శించారు. ఇందులో భాగంగా ఇండియా గేట్ నుంచి న్యూఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు భారీ నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ నిరసన ప్రదర్శనకు నీట్ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబ సభ్యులు, పోలీసుల దాడులకు గురైన బాధితులు ముందుండి నాయకత్వం వహించనున్నారని సీజేపీ స్పష్టం చేసింది. ఈ శాంతియుత మార్చ్‌లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, వేలాది మంది యువతీ యువకులు పాల్గొంటారని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం యువత డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు.

## ఫుడ్ ప్రాసెసింగ్‌తో... పంటలకు విలువ జోడిద్దాం

మొదటి పేజీ తరువాయి...

ప్రక్రియను చేపడతామని ముఖ్యమంత్రి చంద్రబాబు రైతులకు పిలుపునిచ్చారు. ఫుడ్ ప్రాసెసింగ్ ప్రక్రియ ద్వారా ఉత్పత్తులకు విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలిగి సంపద సృష్టికి ఆస్కారం ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. మన వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ఆలోచన అని సీఎం స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ముసునూరు వద్ద గార్మె పాప్ కార్న్‌కా నాన్ జీఎంఓ హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్‌కా సంస్థ ఏర్పాటు చేసి దేశంలోనే అతిపెద్ద జన్యుమార్పిడి కాని ఎక్స పాండబుల్ పాప్ కార్న్ ప్రాసెసింగ్ యూనిట్‌ను ఉపరాష్ట్రపతితో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోంది. మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను. 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎంఓ హైబ్రీడ్ మొక్కజొన్న ఉత్పత్తి చేస్తున్నారు. నూజివీడు సమీపంలోని ముసునూరు వద్ద దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ప్రాసెసింగ్ ప్లాంట్ ను ఏర్పాటు చేయటం సంతోషదాయకం. దేశవ్యాప్తంగా పాప్ కార్న్ ఉత్పత్తిలో 70 శాతం వాటాను కలిగి ఉన్న గార్మె సంస్థకు అభినందనలు. యాంత్రీకరణ, విత్తనాలు, సాగులో సాంకేతికత, రైతుల నుంచి మొక్క జొన్న కొనుగోలు ఇలా అన్నీ వ్యవస్థీకృతంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ మనం కొనుగోలు చేసిన పాప్ కార్న్‌పై పెద్ద ఎత్తున బ్రెజిల్ సహా ఇతర దేశాలకు వెళ్లింది. ఇక నుంచి మన దేశంలోనే ఈ సంపద ఉంటుంది. ఒక్క ఆసియానే కాదు గ్లోబల్ మార్కెట్ కు కూడా మన పాప్ కార్న్ ఎగుమతి కావాలి. ఆంధ్రా పాప్ కార్న్, అరకు కాఫీ తాగేలా రైల్వే స్టేషన్లలోనూ కౌంటర్లు ఏర్పాటు చేసేలా చర్యలు చేపడతాం. కొండవీటి కొయ్య బొమ్మలు లాంటి స్వదేశీ ఉత్పత్తులు ప్రపంచ మార్కెట్లకు వెళ్లాలి. కేంద్రం, రాష్ట్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వాలు వ్యవసాయాన్ని ఆర్థిక శక్తిగా, రైతుల్ని ఎంట్రప్రెన్యూర్లుగా చూస్తున్నాం. రైతులు ఉత్పత్తి చేసిన పంటలకు విలువ జోడించి ఎగుమతి చేయాలన్నదే మా లక్ష్యం. పసుపు, మిరప, మొక్క జొన్న, ఆక్వా తదితర ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు చేరాలి. వ్యవసాయ, ఉద్యాన ఉత్పత్తులను ప్రాసెస్ చేసి విలువ జోడించి ఓ మంచి బ్రాండ్‌తో అంతర్జాతీయ మార్కెట్లకు తరలిద్దాం. అప్పుడే విలువ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుంది." అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 'ప్రస్తుతం మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న వాటిలో కేవలం 10 శాతం మాత్రమే ప్రాసెసింగ్ చేయగలుగుతున్నాం. ప్రాసెసింగ్ పెంచితే అధిక సంపదను ఆర్జించే అవకాశం ఉంటుంది. ప్రత్యేకించి యువత ఈ రంగంపై దృష్టి పెట్టాలి. ప్రతి కుటుంబంలో ఓ పారిశ్రామిక వేత్త రావాలి. మన వద్ద ఉత్పత్తి అయ్యే వాటిని గ్లోబల్ ప్రొడక్టుగా అభివృద్ధి చేయాలి. ఆహారపు అలవాట్ల అనుగుణంగా పంటలు కూడా మారాలన్నారు..

## ష్... ఆమె గురించి మాట్లాడకండి

హైదరాబాద్ ఆగస్ట్ 24 :

కాంగ్రెస్ పార్టీ నియమాలకు నేతలంతా కట్టుబడి ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రి కొండా సురేఖకు టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసుల అంశంపై మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా సీఎం స్పందించారు. పార్టీలోని నేతల క్రమశిక్షణ వ్యవహారాల గురించి నేను చర్చించను. ఆ విషయాన్ని క్రమశిక్షణ కమిటీ చూసుకుంటుంది. అన్నీ పరిశీలించి కమిటీ చర్యలు తీసుకుంటుందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశం అనంతరం అందుబాటులో ఉన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సీఎం సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రంలో జరిగిన తాజా రాజకీయ పరిణామాలు, ఇతర అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. మంత్రి కొండా సురేఖ అంశంపై ఎవరూ మాట్లాడొద్దని, ఇకపై ఆ విషయాన్ని పార్టీ అధిష్ఠానం చూసుకుంటుందని చెప్పారు. సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించనున్నట్లు సీఎం తెలిపారు. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి సంబంధించిన భూసేకరణను నిర్లక్ష్యం చేయొద్దని నేతలకు దిశానిర్దేశం చేశారు. పెండింగ్ భూసేకరణ, ఆర్అండ్ఆర్ నిధులను వెంటనే విడుదల చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. భూసేకరణపై నిర్లక్ష్యం వహిస్తే ఎప్పటికీ ప్రాజెక్టులు పూర్తి కావన్నారు. భూసేకరణ, ఫారెస్టు క్లియరెన్సులకి సంబంధించి నిధులను వెంటనే మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెట్టండని ప్రతినిధులకు సూచించారు. ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, విప్ లు ఆది శ్రీనివాస్, రామచంద్ర నాయక్, బీర్ల ఐలయ్య,వేముల వీరేశం , ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం,వీర్లపల్లి శంకర్ ,ప్రేమ్ సాగర్ రావు, నవీన్ యాదవ్, మట్టా రాగ మాయి, మందల సామేల్,వేద్మ బొజ్జు,కోరం కనకయ్య, లక్ష్మి కాంత రావు,రామ్ దాస్ నాయక్, కడియం శ్రీహరి,డాక్టర్ సంజరు,బత్తుల లక్ష్మారెడ్డి,మనోహర్ రెడ్డి,తెల్లం వెంకట్ రావు , నాగరాజు, రేవూరి ప్రకాష్ రెడ్డి, మురళి నాయక, యశస్విని రెడ్డి, ఎంపీ లు కడియం కావ్య, రఘు వీర్ రెడ్డి,అనిల్ కుమార్ యాదవ్, వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యలు పాల్గొన్నారు.

## మొక్కజొన్న వంగడం ఆవిష్కరించిన ఉప రాష్ట్రపతి

### విదేశీ హైబ్రిడ్ విత్తనాల వాడకాన్ని తగ్గించుకోవాలి

### రైతులకు సూచించిన ఉపరాష్ట్రపతి

ముసునూరు ఆగష్టు 24 :

ఏలూరు జిల్లా ముసునూరులో గోర్మే పాప్‌కార్న్‌కా సంస్థ ఆధ్వర్యంలో జన్యుపరంగా మార్పు చేయని (నాన్-జీఎంఓ) మొక్కజొన్న వంగడాన్ని భారత ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు తో కలిసి ఆవిష్కరించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగిన కార్యక్రమంను జ్యోతి ప్రజ్వలనతో ఉప రాష్ట్రపతి చేయగా, వందేమాతరం, జనగణమన జాతీయ గీతాలు, మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలతో కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ మాట్లాడుతూ విదేశీ హైబ్రిడ్ విత్తనాల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, స్వదేశీ పరిజ్ఞానంతో ఆహార భద్రత స్వయం సమృద్ధిని సాధించడం అత్యంత కీలకమైన అంశం అన్నారు. భారతదేశం భవిష్యత్తులో పాప్‌కార్న్ దిగుమతి చేసుకోకుండా ఇతర దేశాలకు ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతోందని ప్రశంసలు అందుతున్నాయన్నారు. దేశ జీడీపీ, స్థూల విలువ జోడింపు లో వ్యవసాయ రంగం సుమారు 1/5వ వంతు వాటాను కలిగి ఉండటమే కాకుండా, 46.1శాతం మందికి ఉపాధిని, 55శాతం జనాభాకు జీవనాధారాన్ని అందిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో 8 రాష్ట్రాల్లో దాదాపు 17,500 మంది రైతులు 40 వేల ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తూ, ఎటువంటి అప్పుల ఊబిలో పడకుండా మంచి లాభాలు అర్జిస్తున్నారన్నారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం-కిసాన్, పీఎం ఫసల్ బీమా యోజన, కిసాన్ క్రెడిట్ కార్డులతో పాటు మహిళా సంఘాలకు ఆధునిక సాంకేతికతను జోడించే 'నమో డ్రోన్ దీదీ' వంటి పథకాలు వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయన్నారు. అదే సమయంలో, వ్యవసాయాభివృద్ధికి సీఎం చంద్రబాబు రైతు బజార్లు, సహజ వ్యవసాయం వంటి విధానాల ద్వారా అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. దీనికితోడు భవిష్యత్ వ్యవసాయ సమృద్ధి కోసం దక్షిణ భారత నదుల అనుసంధానం అన్ని జిల్లాలకు సమగ్ర సాగునీటి సౌకర్యాల కల్పన అత్యంత ఆవశ్యకమని స్పష్టమవుతోందన్నారు. రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లోని ముసునూరులో దేశంలోనే మొట్టమొదటి నాణ్యమైన, నాన్-జీఎమ్ఓ పాప్‌కార్న్ హైబ్రిడ్ విత్తనాలను ఆవిష్కరించడం, 8 రాష్ట్రాల ఉత్తమ రైతులకు సన్మానం చేయడం సంతోషకరమన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు, ఆహార భద్రతకు రైతాంగమే వెన్నెముక అని, 140 కోట్ల మందికి అన్నం పెడుతూ 45 శాతం మందికి వ్యవసాయ రంగం ఉపాధి కల్పిస్తోందని గుర్తుచేశారు. వరి, గోధుమల తర్వాత మొక్కజొన్న దేశంలో 3వ అతిపెద్ద పంటగా నిలుస్తోందని, ఎల్-నినో వంటి వాతావరణ సవాళ్లను తట్టుకునేలా పరిశోధనలు మరింత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

## పాలన చేతగాని బాబు... విపక్ష పాత్ర పోషించలేని అసమర్థుడు జగన్

మొదటి పేజీ తరువాయి...

మరింత క్లారిటీ ఇచ్చారు. శ్రావణమాసం మూడో శుక్రవారం తన నూతన రాజకీయ పార్టీకి సంబంధించిన పేరు, జెండా, విధివిధానాలు పూర్తి ప్రణాళికను విజయవాడ వేదికగా అధికారికంగా వెల్లడిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసమస్యలపై పోరాడేందుకు, ప్రజల తరఫున గొంతుక వినిపించేందుకు చట్టసభల్లో ప్రత్యేకంగా ప్రతిపక్ష హోదా ఏమీ అవసరం లేదని విజయసాయి వ్యాఖ్యానించారు. ప్రస్తుతం రాష్ట్రంలో వైసీపీ మాత్రమే ఏకైక ప్రతిపక్షంగా ఉందని పేర్కొన్నారు. సాధారణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా, వారి సమస్యలను నేరుగా సభల వరకు తీసుకెళ్లేందుకు ఒక బలమైన స్వతంత్ర రాజకీయ వేదికను ఏర్పాటు చేయడమే తన లక్ష్యమని తెలిపారు.

## చంచల్‌గూడ జైలుకు మాజీ మంత్రి

### రెండు వారాల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన ఈడి కోర్టు

హైదరాబాద్ ఆగస్టు 24 :

మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి నాగేశ్వరరావుకు హైదరాబాద్ ఈడీ కోర్టు రిమాండ్ విధించింది. కారుమూరికి రెండు వారాల పాటు జ్యుడీషియల్ రిమాండ్ విధిస్తూ నిర్ణయం తీసుకుంది. దీంతో ఆయనను చంచల్ గూడా జైలుకు తరలించారు. ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఈడీ అధికారులు ఆదివారం అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. సోమవారం కారుమూరికి, గాంధీ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించారు. అనంతరం ఈడీ ఆఫీసు నుంచి కోర్టుకు తరలించారు. కోర్టు 14 రోజుల పాటు రిమాండ్ విధించడంతో చంచల్ గూడా జైలుకు తరలించారు. ఏపీ మద్యం రవాణా కేసులో కారుమూరి నాగేశ్వరరావు, ఆయన తనయుడు సునీల్ కుమార్ నిందితులుగా ఉన్నారు. సునీల్ కుమార్‌ను జూన్‌లో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. తాజాగా మాజీ మంత్రి కారుమూరిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన స్నేహితుడి ఇంట్లో ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. మరోవైపు వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీని అడ్డు పెట్టుకుని కుంభకోణానికి పాల్పడ్డారని వీరిపై ఆరోపణలు ఉన్నాయి. ఈ ఆరోపణలపై కూటమి ప్రభుత్వం సిట్ ఏర్పాటు చేసింది. దర్యాప్తులో మద్యం ధరలు ఇష్టానుసారంగా నిర్ణయించారని, మామూళ్లు ఇచ్చినవారికే లిక్కర్ అమ్మకాలకు అవకాశం ఇచ్చారని సిట్ అధికారులు గుర్తించారు. ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ డిపోల నుంచి మద్యం దుకాణాలకు లిక్కర్ సరఫరాలోనూ అక్రమాలు జరిగాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు రెండు వేర్వేరు కేసులు నమోదుచేయగా ఈ వ్యవహారంలో నిధుల మళ్లింపు ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మరో కేసు నమోదుచేసింది.

## సెప్టెంబర్ 5న... ఢిల్లీలో కాక్రోచ్ పార్టీ నిరసన మార్చ్

న్యూఢిల్లీ ఆగస్టు 24 :

సెప్టెంబర్ 5న ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ భారీ నిరసన మార్చ్ యువతకు ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపిస్తూ కాక్రోచ్ జనతా పార్టీ సెప్టెంబర్ 5న దేశ రాజధాని న్యూఢిల్లీలో శాంతియుత నిరసన ర్యాలీకి పిలుపునిచ్చింది. జూలై 25న కేంద్ర ప్రభుత్వం చేసిన వాగ్దానాల ఆధారంగానే అప్పట్లో దేశవ్యాప్తంగా చేపట్టిన యువజన ఆందోళనలను తాము సద్భావనతో విరమించామని, అయితే ప్రభుత్వం ఆ కట్టుబాట్లను అమలు చేయకుండా మోసం చేసిందని పార్టీ నేతలు విమర్శించారు. ఇందులో భాగంగా ఇండియా గేట్ నుంచి న్యూఢిల్లీ పోలీస్ ప్రధాన కార్యాలయం వరకు భారీ నిరసన మార్చ్ నిర్వహించనున్నట్లు పార్టీ అధికారికంగా ప్రకటించింది. ఈ నిరసన ప్రదర్శనకు నీట్ ఆందోళనల్లో ప్రాణాలు కోల్పోయిన బాధితుల కుటుంబ సభ్యులు, పోలీసుల దాడులకు గురైన బాధితులు ముందుండి నాయకత్వం వహించనున్నారని సీజేపీ స్పష్టం చేసింది. ఈ శాంతియుత మార్చ్‌లో దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులు, యువజన సంఘాల ప్రతినిధులు, వేలాది మంది యువతీ యువకులు పాల్గొంటారని వెల్లడించింది. కేంద్ర ప్రభుత్వం యువత డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం ఆగదని వారు హెచ్చరించారు.

## ఎవ్వరికైనా 100 శాతం న్యాయం చేయలేం

మొదటి పేజీ తరువాయి...

చర్చనీయాంశంగా మారింది. కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని పార్టీ నేతలు పట్టుబడుతున్న పరిస్థితి రోజురోజుకు పెరుగుతోంది. ఈ నేపథ్యంలో సురేఖ అంశంపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. సోమవారం మెదక హౌసింగ్ బోర్డులోని వినాయక ఫంక్షన్ హాల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక జిల్లా సమావేశంలో టీపీసీసీ చీఫ్ మాట్లాడుతూ కొండా సురేఖ అంశాన్ని క్రమశిక్షణ కమిటీ పరిశీలిస్తోందని చెప్పారు. ఇప్పటికే ప్రిలిమినరీ రిపోర్ట్‌ను ఏఐసిసికి అందజేశామని.. డిటైల్డ్ రిపోర్ట్ వచ్చాక పెద్దలు ఈ అంశంపై నిర్ణయం తీసుకుంటారని వెల్లడించారు. కాంగ్రెస్ పెద్ద పార్టీ కాబట్టి చెపకునే స్వేచ్ఛ ఎక్కువ ఉంటుందని మహేశ్ తెలిపారు. స్వేచ్ఛ హద్దులు దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవని.. తనతో సహా అందరూ హద్దుల్లో ఉంటే మంచిదన్నారు. ప్రతి కుటుంబంలో సమస్యలు ఉన్నట్టుగానే కాంగ్రెస్ కుటుంబంలో కూడా ఉంటాయన్నారు. 'కష్టపడ్డ కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం జరుగుతుంది.. ఇది సీఎం మాట, నా మాట, మీనాక్షి నటరాజన్ మాట. ఎవ్వరికీ కూడా 100 శాతం న్యాయం చేయలేం నేను వాస్తవాలు మాట్లాడతా. 70 శాతం పదవులు పాత కాంగ్రెస్ నాయకులకే దక్కేలా అధిష్ఠానం హామీ ఇచ్చింది. ములుగులో మంత్రి సీతక్క పాత నాయకులకే పదవులు ఇచ్చారని తెలిపారు. సోషల్ మీడియాలో బిఆర్ఎస్, బిజెపిలు కాంగ్రెస్ పార్టీపై దుష్ప్రచారం చేస్తున్నాయని మహేశ్ మండిపడ్డారు. సోషల్ మీడియాపై కేటీఆర్ ఆశలు పెట్టుకున్నారని, కత్తి దూసినోడు కత్తికే చనిపోతాడు అన్నట్టు కేటీఆర్‌ను సోషల్ మీడియానే ఖతం చేస్తుందని వ్యాఖ్యానించారు. పదేళ్లు బిఆర్ఎస్ చేసిన దోపిడీ, భూ దందా, అరాచక పాలనను ప్రజలు మర్చిపోలేదన్నారు. మల్లన్నసాగర్ కట్టేటపడు ఎంతమందిపై కేసులు పెట్టి జైలుకి పంపారో జనాలు మర్చిపోలేదని తెలిపారు. ప్రధాని మోదీ ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో మెదక ఎంపీ రఘునందన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఉన్న ఉద్యోగాలు తీసేసిన ఘనత ప్రధాని మోదీది అంటూ విరుచుకుపడ్డారు. మోదీ హవా తగ్గిందని.. ఎపడు ఎన్నికలు జరిగినా ఆయన ఇంటికి పోక తప్పదన్నారు. ప్రజలు 39 సీట్లు ఇచ్చి ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ ఫామ్ హౌస్‌కే పరిమితం అయ్యారని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలలో ప్రజాస్వామ్య తక్కువన్నారు. దళితుడు రాజయ్య డిప్యూటీ సీఎంగా ఉంటే రాత్రికి రాత్రే పదవి నుంచి తొలగించారని, ఈటల రాజేందర్‌ను మెడ పట్టి గెంటేశారని మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.

## దివ్యాంగులకు మినహా.... కళ్యాణ లక్ష్మిపై కొనసాగుతున్న స్టే

మొదటి పేజీ తరువాయి...

అందిస్తున్న అదనపు సాయాన్ని కొనసాగించేందుకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వీరికి ఈ పథకాల వర్తింపుపై విధించిన స్టేను హైకోర్టు సోమవారం ఎత్తివేసింది. దివ్యాంగులకు మినహా మిగిలిన వారికి ఈ రెండు పథకాలపై విధించిన స్టే కొనసాగుతోందని స్పష్టం చేసింది. అయితే దీనిపై వాదనలు వినిపించడానికి రాష్ట్ర ప్రభుత్వం రెండు వారాల గడువు కోరింది. ఈ పథకాల కింద సాధారణ లబ్ధిదారులతో పోలిస్తే దివ్యాంగ వధువులకు 25 శాతం అదనంగా ఆర్థిక సాయం అందించేలా గతంలో ప్రభుత్వం జీవో జారీ చేసింది. సోమవారం ఈ పథకాల అమలుపై దాఖలైన పిటిషన్లపై విచారణ జరిగింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ దివ్యాంగుల హక్కుల చట్టం నిబంధనలకు అనుగుణంగానే ఈ ప్రత్యేక ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు హైకోర్టు ధర్మాసనానికి స్పష్టం చేశారు. ప్రభుత్వ వాదనలతో ధర్మాసనం ఏకీభవించింది. దీంతో దివ్యాంగ వధువులకు ఈ పథకాల కొనసాగింపునకు ఆదేశించింది.

## అంతర్జాతీయ న్యాయ సేవలకు హైదరాబాద్ వేదిక

మొదటి పేజీ తరువాయి...

ప్రపంచ దేశాలతో మెరుగైన అనుసంధానం హైదరాబాద్‌కు ప్రత్యేక బలాలని మంత్రి చెప్పారు. ఈ అనుకూలతలతో ఏఐ ఆధారిత ప్రొఫెషనల్, న్యాయ సేవలకు హైదరాబాద్ ఒక ప్రధాన అంతర్జాతీయ కేంద్రంగా ఎదిగే సామర్థ్యం కలిగి ఉందని పేర్కొన్నారు. తెలంగాణను అంతర్జాతీయ నైపుణ్యంతో అనుసంధానించే ఇటువంటి కార్యక్రమాలు రాష్ట్రానికి ప్రపంచస్థాయిలో మరింత గుర్తింపు తీసుకొస్తాయని అన్నారు. న్యూయార్క్‌లోని కవేటి లా ఫర్మ్ వ్యవస్థాపకుడు, మేనేజింగ్ అటార్నీ డాక్టర్ శ్రీనివాస్ రావు కవేటి, కవేటి ఇంటర్నేషనల్ ఏఐ ఫర్మ్‌ను హైదరాబాద్‌కు తీసుకురావడాన్ని మంత్రి అభినందించారు. తెలంగాణకు చెందిన డాక్టర్ కవేటికి భారత్‌తో పాటు అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, ఆస్ట్రేలియా, కెనడా, యూఏఈ దేశాలకు సంబంధించిన అంతర్జాతీయ న్యాయ వ్యవహారాల్లో 35 సంవత్సరాలకు పైగా అనుభవం ఉంది. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని లీ'ఇంటర్నేషనల్ లీగల్ యాక్సెస్ హబ్'లిగా తీర్చిదిద్దాలని సంస్థ ప్రతిపాదించింది. భారత్‌లోని వ్యక్తులు, వ్యాపార సంస్థలు, ప్రవాస భారతీయులు (చీ=×ం), పెట్టుబడిదారులు వివిధ దేశాల్లో న్యాయ సేవలు అందిస్తున్న న్యాయవాదులు, న్యాయ నిపుణులతో అనుసంధానం కావడానికి ఈ కేంద్రం వేదికగా పనిచేయనుంది. అంతర్జాతీయ న్యాయ నిపుణులు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భాల్లో ప్రత్యక్ష సంప్రదింపులు, న్యాయ వ్యూహాలకు సంబంధించిన సమావేశాలు నిర్వహించే అవకాశాన్ని కూడా కల్పించనున్నారు. సంస్థ సేవలు వివిధ దేశాల్లోని పలు న్యాయ విభాగాలను కవర్ చేయనున్నాయి. అమెరికాలో ఇమ్మిగ్రేషన్, కుటుంబ చట్టాలు, సివిల్ లిటిగేషన్, అంతర్జాతీయ విడాకులు, కార్పొరేట్, క్రిమినల్ లా అంశాలు; యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇమ్మిగ్రేషన్, కుటుంబ చట్టాలు, సివిల్ లిటిగేషన్; యూఏఈలో కార్మిక పరిహారం, ఉద్యోగ సంబంధిత సమస్యలు, ఒప్పంద వివాదాలకు సంబంధించిన సేవలను అందించనున్నట్లు సంస్థ తెలిపింది. భారత్‌లో కంపెనీ, ట్రేడ్‌మార్క్ చట్టాలు, సివిల్, క్రిమినల్, కార్మిక చట్టాలు, రిట్ పిటిషన్లు, రుణాల రికవరీ, వినియోగదారుల చట్టాలు, స్పెషల్ లీవ్ పిటిషన్లు, రియల్ ఎస్టేట్ వ్యవహారాలకు సంబంధించిన సేవలను అందించనుంది.

హైదరాబాద్ కేంద్రం కార్యకలాపాల్లో న్యాయ సేవల్లో కృత్రిమ మేధను బాధ్యతాయుతంగా వినియోగించడం ప్రధాన అంశంగా ఉండనుంది. ముఖ్యంగా సంక్లిష్టమైన అంతర్జాతీయ న్యాయ వ్యవహారాల్లో లీగల్ రీసెర్చ్, సమాచార సేకరణ, డాక్యుమెంట్ల విశ్లేషణ, డిస్కవరీ, కేసులకు సంబంధించిన ప్రాథమిక మ్యాపింగ్ తదితర అంశాల్లో ఏఐ సహకారాన్ని వినియోగించాలని ప్రతిపాదించారు.

అయితే ఏఐ న్యాయవాదులకు ప్రత్యామ్నాయం కాదని, వారికి సహకరించే సాధనంగా మాత్రమే ఉంటుందని సంస్థ స్పష్టం చేసింది. న్యాయ సలహాలు, ప్రాతినిధ్యం వంటి సేవలను ఆయా దేశాల్లో అమలులో ఉన్న చట్టాలు, వృత్తిపరమైన నైతిక ప్రమాణాలకు అనుగుణంగా అర్హత కలిగిన న్యాయ నిపుణులు మాత్రమే అందిస్తారని పేర్కొంది.

సాంకేతిక పరిజ్ఞానం అంతిమంగా ప్రజలకు ఎదురయ్యే అడ్డంకులను తగ్గించడానికి, సేవల్లో సామర్థ్యాన్ని పెంచడానికి, ప్రత్యేక నైపుణ్యంతో కూడిన సేవలను మరింత విస్తృత వర్గాలకు చేరువ చేయడానికి ఉపయోగపడాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ సాంకేతిక సామర్థ్యాన్ని ప్రపంచస్థాయి ప్రొఫెషనల్ నెట్‌వర్క్‌లతో అనుసంధానించే ఇటువంటి సంస్థలు తెలంగాణను ఆవిష్కరణలు, విజ్ఞాన ఆధారిత సేవలకు అంతర్జాతీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో దోహదపడతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

# బి.పి. మండల్ స్ఫూర్తితో బి.సి జనగణన సాధిద్దాం

**భద్రాద్రి న్యూస్ ,కాలమిస్ట్:**

ఇండియా జనాభాలో 60 శాతం పైగా ఉండి తరతరాలుగా వారి జనాభా కన్నా ఎక్కువ సేవలు అందిస్తూ సామాజిక అభివృద్ధికి, మానవ మనుగడకు ఎనలేని సేవ చేసిన బి.సి సమాజం లు నేడు అధోగతిలో ఉంది. ఆది మానవుడి నుండి ఆధునిక మానవ సమాజం వరకు ఎన్నో ఆవిష్కరణలు చేయడమే కాక ఇందు గలరు అందు లేరని సందేహం వలదు అన్నట్లు అన్ని రంగాల్లో వారి సేవలు అందించి స్వాభిమానంతో జీవించిన బి.సి లు నేడు ఆందోళనతో జీవిస్తున్నారు. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ, పట్టణీకరణతో వృత్తులు కోల్పోయి రోడ్డున పడ్డారు. వృత్తులను ఆధునీకరించి బి.సి ల అభివృద్ధికి తోడ్పడాల్సిన పాలకులు నిర్లక్ష్యంతో ప్రవర్తిస్తూ కార్పొరేట్ రంగానికి పెద్దపీట వేసి బి.సి లకు తీరని అన్యాయం చేస్తున్నారు. స్వాతంత్రానికి పూర్వం వారి వారి వృత్తులతో ఎంతో అభివృద్ధి పథంలో జీవించి ఆత్మగౌరవంతో బతికిన బి.సి లు స్వాతంత్రాణాంతరం తీవ్ర దోపిడికి గురవుతూ బతకలేక వలసలు పోవడమే కాకుండా బలిదానాలు చేసుకుంటున్నారు.

వెనుకబడిన తరగతుల అభివృద్ధి కోసం దేశంలో ఎందరో మహనీయులు పోరాటాలు చేసి ఎన్నో హక్కులు, రిజర్వేషన్లు కల్పించారు. సర్దార్ సర్వాయి పాపన్న మొదలుకొని నారాయణ గురు, పెరియార్, మహాత్మ జ్యోతిరావు పూలే, ఛత్రపతి శివాజి, భసవేశ్వరుడు, సాహు మహారాజ్, పండగ సాయన్న, కృష్ణ స్వామి, పండిత అయోతి దాస్, అయ్యంకాలి, సర్దార్ గౌతు లచ్చన, చాకలి ఐలమ్మ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కాన్షిరామ్, కొండా లక్ష్మణ్ బాపూజి, మారోజు వీరన్న లాంటి ప్రముఖులు ఎందరో కృషి చేసారు. స్వాతంత్రాణాంతరం ఎన్నో పోరాటాల ఫలితంగా బి.సి లకు రిజర్వేషన్లు కల్పించి అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం కోసం బి.సి ల జీవితాలను అధ్యయనం చేయడం కోసం అప్పటి జనతాపార్టీ బి.పి మండల్ (బ్రిందేశ్వర్ ప్రసాద్ మండల్) నేతృత్వంలో కమీషన్ వేశారు. రెండు సంవత్సరాల పాటు దేశమంతా విస్తృతంగా పర్యటించి అన్ని వర్గాల ప్రజల కష్టాలను ప్రత్యక్షంగా తెలుసుకొని బి.పి మండల్ తన నివేదికలో బి.సి ల అభివృద్ధికి 40 సూచనలు చేశారు. ఆ 40 సూచనల్లో ఒక్కటైన విద్య, ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లు మాత్రమే అమలులోకి తెచ్చి మిగతా 39 సిపార్సులను గత 40 ఏండ్లుగా బుట్టదాఖలు చేశారు. మండల్ కమీషన్ సిపార్సుల అమలుతో పాటు చట్టసభల్లో రాజ్యాంగ రిజర్వేషన్ల కోసం బి.సి లు దేశ వ్యాప్త ఉద్యమం చేయాల్సిన అవసరముంది.

మండల్ కమీషన్ నివేదికను, ఓ.బి.సి ల రిజర్వేషన్లను దాదాపు అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకించాయి. ప్రధాన రాజకీయ పార్టీలైన బిజెపి, కాంగ్రెస్ లు బి.సి. ల రిజర్వేషన్లను అడ్డుకునేందుకు ఉద్యమించాయి. ఆయా యూనివర్సిటీల్లో ఆ పార్టీల విద్యార్థి సంఘాలతో, ఆధిపత్య కులాలకు చెందిన విద్యార్థులను ఒబిసి రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఎగదోశారు. ప్రభుత్వ సంస్థలలోని ఆధిపత్య కులాల ఉద్యోగ వర్గం, మీడియా, ఒబిసి రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమానికి అన్ని విధాలుగా సాయం అందించారు. ఒబిసి రిజర్వేషన్ల వ్యతిరేక పోరాటంతో ఆయా రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, మేధావుల ముసుగులు తొలిగిపోయాయి. ఏకంగా బిజెపి పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న జనతాపార్టీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకొని వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చారు. ఆనాటి నుండి నేటి వరకు ఒబిసి ల పట్ల బిజెపి వ్యతిరేకంగానే ఉంది. రాష్ట్రాల్లో, కేంద్రంలో అధికారంలోకి రావడం కోసం బి.సి కులాల అసమానతలను వాడుకొని ఒబిసి ఓట్లను కాజేయడం తప్ప బి.సి. లకు ఒరగబెట్టిందేమి లేదు.

భారతదేశంలో విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లకు వంద సంవత్సరాలకు పైనే చరిత్ర ఉంది. స్వాతంత్రానికి పూర్వమే బ్రిటిష్ పాలనలో కొన్ని ప్రాంతాల్లో, కొన్ని స్వదేశీ సంస్థానాల్లో రిజర్వేషన్లు ఉండేవి. భారత రాజ్యాంగానికి మొట్టమొదటి సవరణ రిజర్వేషన్లకు రాజ్యాంగ బద్ధత కల్పించడం కోసమే చేయబడిందంటే వెనుకబడిన వర్గాల రిజర్వేషన్ల ప్రాముఖ్యత ఎంతో అర్థం చేసుకోవాలి. స్వాతంత్రానికి పూర్వం నుండి కూడా అసమాన సమాజంలో సమానత్వం కోసం తీసుకునే చర్యలలో రిజర్వేషన్లను ఒక చర్యగా భావించడం జరిగింది. రిజర్వేషన్లు రాజ్యాంగంలోని సమానత్వ సూత్రాలకు (ఆర్టికల్ 15&16) వ్యతిరేకమని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. సుప్రీంకోర్టు తీర్పు వ్యతిరేకంగా వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లకు మద్దతుగా పెరియార్ చేసిన ఉద్యమంతో 1951 లో పార్లమెంటు లో మొట్టమొదటి రాజ్యాంగ సవరణ చేపట్టి ఆర్టికల్ 15 కు క్లాజు 4 ను చేర్చి ప్రభుత్వం సామాజికంగాను, విద్యా పరంగానూ వెనుకబడిన వర్గాల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చని ఆ క్లాజులో పేర్కొన్నారు. నాటి నుండీ నేటి వరకు రిజర్వేషన్లకు సంబంధించిన అనేక విషయాల గురుంచి వివాదాలు, ఉద్యమాలు, శాసనాలు, న్యాయస్థానాల తీర్పులు కొనసాగుతూనే ఉన్నాయి. మెడికల్ సీట్ల కేటాయింపులో బి.సి లకు అన్యాయం జరుగుతుందని సుప్రీంకోర్టు వరకు వెళ్లిన సంఘటనలు ఉన్నాయి. ఇవన్ని గమనిస్తే మెజార్టీ ప్రజల వెనుకబాటుతనం సమస్య జఠిలతను, ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. రాజ్యాంగ సవరణ జరిగి 75 ఏండ్లు దాటినా, మండల్ కమీషన్ నివేదిక ఇచ్చి 40 ఏండ్లు దాటినా బి.సి ల స్థితిగతులు మెరుగుపడకపోగా మరింత క్షీణించి పోతున్నాయి. అన్ని రంగాల్లో ప్రత్యేక అవకాశాలు కల్పిస్తేనే వెనుకబడిన వర్గాలు అభివృద్ధి జరుగుతుందని ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధిస్తుంటే పాలకవర్గాలు వీరి హక్కులను కొల్లగొట్టడానికి ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తున్నారు. దాదాపు మండల్ కమీషన్ అమలు సమయం నుండే ప్రైవేటీకరణను ప్రోత్సహించడం మొదలుపెట్టారు. దాదాపు అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేశారు. విద్యా రంగంలో బహుజనుల అవకాశాలను కొల్లగొట్టడానికి ఏకంగా ప్రైవేట్ యూనివర్సిటీలను తీసుకొచ్చారు. అన్ని రకాల విద్యా సంస్థల్లో ప్రైవేట్ విద్యా సంస్థలు ఎక్కువ ఉండడంతో గత 70 ఏండ్లుగా పోరాడి సాధించుకున్న రిజర్వేషన్లు ఎందుకు పనికి రాకుండా పోతున్నాయి. ప్రైవేటకరణకు వ్యతిరేకంగా బహుజనులు మరో పోరాటం చేయాల్సిన అవసరముంది.



దేశంలో బ్రిటిష్ పాలన కొనసాగుతున్న సమయంలోనే వెనుకబడిన వర్గాలు, అంటరాని కులాలు, ముస్లింలకు జరుగుతున్న అన్యాయాలపై పోరు చేసి జనాభా ప్రాతిపదికన ప్రత్యేక నియోజకవర్గాల ప్రాతినిధ్యం ఇవ్వాలని అన్ని రంగాల్లో అవకాశం కల్పించాలని ఉద్యమాలు చేశారు. ఫలితంగా ముస్లింలు, ఎస్సిలు, క్రిస్టియన్లకు ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించారు. బి.సి లకు మాత్రం ఎలాంటి ప్రత్యేక నియోజకవర్గాలు కేటాయించలేదు. స్వాతంత్ర ఉద్యమ సమయం, రాజ్యాంగ రచన సమయంలో బి.సి. ల హక్కుల గూర్చి, విద్యా ఉద్యోగ రంగాల్లో బి.సి ల రిజర్వేషన్ గూర్చి, రాజకీయ రిజర్వేషన్ల గూర్చి పోరాటం చేసినా అప్పటి కాంగ్రెస్ నాయకులు ఆ పోరాటాలను నీరుగార్చారు. స్వాతంత్రం సిద్ధించిన అనంతరం బి.సి ల హక్కుల పోరాటం వల్ల బి.సి ల సామాజిక ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేయడం కోసం 1953 జనవరిలో కాకా కలేల్కర్ కమిషన్ ను ప్రభుత్వం నియమించింది. 1955 మార్చిలో కమిషన్ నివేదిక సమర్పించి బి.సి ల అభివృద్ధికి పలు సూచనలు చేసింది. దేశంలో 2399 కులాలు వెనుకబడిన తరగతులుగా ఉన్నాయని అందులో 837 కులాలు బాగా వెనుకబడిన కులాలుగా ఉన్నాయని నివేదికలో తెలిపింది. భూ సంస్కరణలు జరిపించాలని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునవ్యవస్థీకరించాలని, వయోజన విద్య, విశ్వవిద్యాలయాల చదువులు మొదలగు అనేక రంగాల్లో వెనుకబడిన తరగతుల కోసం సత్వరాభివృద్ధి చేపట్టాలని సూచనలు చేశారు. 1961 లో కులాల వారీగా జనాభా లెక్కలు తీయాలని, కమీషన్ సమర్పించిన నివేదికను ప్రభుత్వం బుట్టదాకలు చేసింది. మండల్ కమీషన్ నివేదిక కూడా బి.సి జనగణన చేయాలని స్పష్టంగా తెలిపింది. మండల్ కమీషన్ అమలుపై కోర్టులో కేసు నడిచిన సందర్భంలో కూడా 1931 తర్వాత బి.సి జనాభా లెక్కలు తీయలేదని, జనాభా లెక్కలు లేకుండా ఏ ప్రాతిపదికన బి.సి లకు రిజర్వేషన్లు అమలు చేస్తారని సుప్రీమ్ కోర్టు ప్రశ్నించింది. కమీషన్లు చెప్పినా, కోర్టు ప్రశ్నించినా కూడా ఈ దేశంలో పాలన కొనసాగించిన కాంగ్రెస్, పాలన కొనసాగిస్తున్న బిజెపి బి.సి జనగణన చేయడం లేదు. ఆదిపత్య దోపిడి కులాలకు చెందిన పార్టీలు దేశాన్ని పాలిస్తుండడం వల్లనే బి.సి జనగణతో పాటు, బి.సి లకు చట్టసభల్లో వాటా దక్కడం లేదు. 80 ఏండ్ల వాస్తవాన్ని అధ్యయనం చేసిన తర్వాతనైనా బి.పి. మండల్ స్ఫూర్తితో బి.సి లు స్వతంత్ర రాజకీయ శక్తిగా ఎదిగి రాజ్యాధికారంలోకి వస్తేనే అన్ని సమస్యలకు పరిష్కారం జరుగుతుంది.

1977 లో జనతా పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో తాము అధికారంలోకి వస్తే కాకా కలేల్కర్ కమీషన్ నివేదిక అమలు చేసి బీ.సి లకు న్యాయం చేస్తామని తెలిపింది. అధికారంలోకి వచ్చిన జనతా పార్టీ కమీషన్ నివేదికను అమలుపరచక పోవడంతో బి.సి సంఘాల, నాయకులు ఒత్తిడి చేయడంతో అప్పటి ప్రధాని మొరార్జీ దేశాయి ప్రభుత్వం మరోలా స్పందించి కాక కలేల్కర్ కమీషన్ నివేదిక సమర్పించి చాలా ఏండ్లు అయిందని కొత్త కమిషన్ ను నియమిస్తామని చెప్పింది. బీహార్ మాజీ ముఖ్యమంత్రి బి.పి మండల్ ఆధ్వర్యంలో 1978 డిసెంబర్ లో రెండవ బి.సి కమీషన్ నియమించింది. బి.పి. మండల్ 1980 డిసెంబర్ 31 న నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. మళ్ళీ పాత కథే నివేదిక అమలులో జాప్యం దాంతో బి.సి నాయకులంతా ఏకమై 1981 సెప్టెంబర్ లో నేషనల్ యూనియన్ ఆఫ్ బ్యాక్ వార్డ్ క్లాసెస్ అనే ఒక ఉద్యమ సంస్థను ఏర్పాటు చేశారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాకూర్ ఆ సంస్థను ప్రారంభించగా చౌదరి బ్రహ్మప్రకాష్ అధ్యక్షులుగా ఉండి ఉద్యమం చేశారు. 110 మంది పార్లమెంటు సభ్యులు సంతకాలతో కూడిన మెమోరాండం ప్రభుత్వానికి సమర్పించారు. ఐదు లక్షల ప్రజల సంతకాలతో కూడిన మెమోరాండం రాష్టపతి జ్ఞాని జైల్ సింగ్ కు ఇచ్చారు. 1988 నుండి 1990 వరకు బహుజన సమాజ్ పార్టీ మండల్ నివేదిక అమలుకు పోరాటం చేసింది. బి.పి. మండల్ కమీషన్ అమలు కోసం ఢిల్లీ లోని బోట్స్ క్లబ్ వద్ద కాన్షీరాం 48 రోజుల ధర్నా చేసాడు. ఉద్యమాల ఒత్తిడి, మ్యానిఫెస్టోలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం అప్పటి ప్రధాని వి.పి సింగ్ 1990 ఆగస్టు 7 న మండల్ నివేదిక అమలుపరుస్తానని ప్రకటన చేసాడు. ప్రధాని ప్రకటనతో దేశ వ్యాప్తంగా ఆధిపత్య కులాల ఆందోళన చేయడమే కాకుండా అన్ని పార్టీలు మండల్ నివేదికకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేశాయి. నిరసనగా బయట నుండి వి.పి ప్రభుత్వానికి మద్దతు ఇస్తున్న బీజేపీ మద్దతు ఉపసంహరించడమే కాకుండా ప్రజలను తప్పుదోవ పట్టివ్వడం కోసం ఆనాడు బీజేపీ అద్వానీ నాయకత్వంలో అయోధ్య రధ యాత్ర చేపట్టింది. ఆనాడు రామమందిర్ రధ యాత్ర చేసిన బిజెపి నేడు రామమందిర నిర్మాణంలో బి.సి లను బాగస్థులను చేసి మతంలో ముంచి బి.సి ల హక్కులను గాలికొదిలే విధంగా చేస్తున్న బిజెపి కుటిల రాజకీయాలను ఒబిసి లు గమనించాలి.

మండల్ కమీషన్ ను అమలు చేయరాదని ఆధిపత్య కులాల వారు కోర్టును ఆశ్రయించారు. చివరకు 1993 లో మండల్ నివేదిక అమలుకు కోర్టు అనుమతి ఇవ్వడంతో బి.సి లకు కేంద్ర సర్వీసుల్లో, ఐఎఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఐటి, ఎన్ఐటి, ఐఐఎం, కేంద్రీయ విశ్వ విద్యాలయాల్లో 52 శాతం జనాభా ఉన్న బి.సీ లకు 27 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. మొత్తం మండల్ కమీషన్ బి.సి ల అభివృద్ధికి 40 సూచనలు చేయగా అందులో ఒకటైన విద్యా ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్ కల్పించి అప్పటి ప్రభుత్వం చేతులు దులుపుకుంది.

పారిశ్రామికీకరణ, ప్రైవేటీకరణ వల్ల స్థానిక వర్గాల వృత్తులు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని వారికి ప్రత్యామ్నాయం చూడాలని, భూ సంస్కరణలు చేపట్టాలని, ఓబీసీ లకు కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, అన్ని రకాల ఆర్థిక వనరులను రాష్ట్రాలకు కేంద్రమే సమకూర్చాలని, ప్రైవేట్ సంస్థల్లోనూ ఉద్యోగాల్లో ఓబీసీ లకు 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఒబిసి లు ఉన్న ప్రాంతంలో వయోజన విద్యతో పాటు రెసిడెన్షియల్ పాఠశాలలు ప్రారంభించి విద్యార్థుల డ్రాపవుట్ తగ్గించి మెరుగైన విద్య అందించాలని, ఉన్నత విద్యలో చేరే వాళ్లకు ప్రత్యేక కోచింగ్ లు ఇవ్వాలని, కుల వృత్తిదారులకు ఆర్థిక సహాయం, సాంకేతిక సహాయం అందించి చిన్నతరహా పరిశ్రమలు స్థాపించుకోవడానికి ప్రోత్సకాలు, వృత్తి కులాలకు సహకార సంఘాలు, ఉత్పత్తి రంగంలో మౌలిక మార్పులు, ఓబీసీ లకు మిగులు భూమి పంపిణీ లాంటి సూచనలు నివేదికలో పొందుపరిచారు. బి.సి దెవలప్మెంట్ కార్పోరేషన్ ఏర్పాటు చేసి సామాజిక, విద్యా, ఆర్థిక అబివృద్ధికి కృషి చేయాలని ఓబీసీల్లో అత్యంత వెనుకబడిన సమూహాలకు సముచిత స్థానం కల్పించేందుకు వారు అత్యధికంగా నివసించే ప్రాంతాలను డీ లిమిటేషన్ సమయంలో నియోజకవర్గాలుగా మార్చాలని కూడా సూచించారు.

### నీతి నిజాయితీకి మారు పేరు బి.పి మండల్

ఆగస్టు 25, 1918 లో బీహార్ రాష్ట్రం మధేపూర్ జిల్లా మోరో గ్రామంలో రాస్ బీహారీ లాల్ మండల్ జమీందారి కుటుంబంలో జన్మించిన బి.పి మండల్ 23 ఏటనే జిల్లా కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. జీతం తీసుకోకుండా జుడిషియల్ మేజిస్ట్రేట్ గా పనిచేశారు. 1952 మొదటిసారిగా శాసనసభకు ఎన్నికైన మండల్ ఆరోగ్య శాఖ మంత్రిగా, ఎం.పి గా పనిచేశారు. రామ్ మనోహర్ లోహియా నాయకత్వంలో పనిచేసిన మండల్ 1967 లో బీహార్ లో జరిగిన ఎన్నికల్లో 69 మంది ఎమ్మెల్యేలను గెలిపించి ఫిబ్రవరి 1968 లో బీహార్ ముఖ్యమంత్రిగా పదవి చేపట్టారు. బయట నుండి మద్దతునిచ్చిన కాంగ్రెస్ పార్టీ నాయకుల అవినీతిపై విచారణ జరిగితే ఆ విచారణ బుట్టదాకలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల్ పై ఒత్తిడి చేసింది. అయినా నిజాయితీగా కాంగ్రెస్ అవినీతి నాయకులపై చర్య తీసుకున్నారు. దాంతో కాంగ్రెస్ మద్దతు ఉపసంహరించుకోవడంతో ప్రభుత్వం కూలిపోయింది తన ప్రభుత్వం కూలిపోతుందని తెలిసిన నీతికోసం నిలబడిన నాయకుడు బి.పి. మండల్ 1974 లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ నాయకత్వంలో అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని 1977 లో జనతాపార్టీ తరుపున లోకసభకు ఎన్నికయ్యారు.

కమిషన్ నివేదిక సమర్పించిన 10 ఏండ్ల తర్వాత కమీషన్ సూచించిన 40 సూచనల్లో ఒక్క విద్య ఉద్యోగాల్లో మాత్రమే రిజర్వేషన్ కల్పించింది. అది కూడా 50 శాతం పైనున్న బి.ల లకు 27 శాతం రిజర్వేషన్ కల్పించింది. అలా కల్పించిన రిజర్వేషన్ పలాలను ఇప్పిడిప్పుడే అందుకుంటున్న బి.సి లకు క్రిమిలేయర్ తో ఉన్నత విద్యా సంస్థల్లో ఒబిసి ల కోటాలో మిగిలిన సీట్లను కూడ ఆధిపత్య కులాల వారు కొట్టేస్తున్నారు. అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఇస్తే అడ్డురాని చట్టం బి.సి లకు 52 శాతం రిజర్వేషన్ ఇస్తే ఏమవుద్దని బి.సి లు పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన అవసరముంది. 52 శాతం జనాభా కలిగిన బి.సి లకు సకల సామాజిక రంగాల్లో 52 శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిన బాధ్యత మరచిన ఆధిపత్య ప్రభుత్వాలు ఎన్నో పోరాటాల పలితంగా వచ్చిన 27 శాతం రిజర్వేషన్లను కాలరాయడానికి ప్రైవేటీకరణను ప్రోత్సహించడం సిగ్గుచేటు. 27 శాతం రిజర్వేషన్లను కాపాడుకోవడానికి, ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి, మండల్ సూచించిన ఇతర సూచనలను సాధించుకోవడానికి, చట్టసభల్లో బి.సి ల రిజర్వేషన్ల కోసం, ఒబిసి జనగణన కోసం బి.పి. మండల్ ఆదర్శంగా బి.సి లు ఉద్యమించాల్సిన అవసరముంది. బహుజన రాజ్యాధికారం కోసం ఉద్యమిస్తున్న సమాజ్ వాద్ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ లాంటి వారు బి.సి ల హక్కులకు మద్దతుగా పోరాటం చేయాల్సిన బాధ్యత ఉంది. బి.సి కులాలు, సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఒక్కటై మండల్ స్ఫూర్తిగా మండల్ నివేదికను అమలుకోసం ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడమే పరిష్కారం.

### కాంగ్రెస్, బిజెపి రెండు బి.సి వ్యతిరేక పార్టీలే

అన్ని పార్టీలకన్నా ఎక్కువ కాలం దేశాన్ని పాలించిన కాంగ్రెస్, గత 12 ఏండ్లుగా పాలిస్తున్న బిజెపి బి.సి లకు వ్యతిరేక పార్టీలే. కాంగ్రెస్ అధికారంలో ఉన్నపుడు బి.సి జనగణన చేయనప్పుడు ప్రతిపక్షంలో ఉన్న బిజెపి తాము అధికారంలోకి వస్తె ఒబిసి జనగణన చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత ఒబిసి జనగణన సాధ్యం కాదని నిస్సిగ్గుగా చెప్పి దేశంలోని 80 కోట్ల ఒబిసి లకు మోసం చేసింది. పూర్వ కాంగ్రెస్ పాలకులు ఒబిసి ల సమస్యలను సరిగా అర్థం చేసుకోకుండా ఒబిసి లకు అన్యాయం చేసిందని, ఇకముందు ఒబిసి లకు న్యాయం చేస్తామని, కుల జనగణన సామాజికన్యాయానికి ఎక్స్ రే లాంటిదని కాంగ్రెస్ అధికారంలోకి వస్తె కుల జనగణన జరిపి రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తామని రాహుల్ గాంధీ ప్రకటించారు. తెలంగాణ ఎన్నికల ముందు పెద్ద బహిరంగ సభ పెట్టి స్థానిక సంస్థల్లో బి.సి లకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించి మూడు ఏండ్లు కావస్తున్నా దిక్కు లేని స్థితి. 42 శాతం రిజర్వేషన్లకు ఉన్న రాజ్యాంగపర అడ్డంకులను తొలగించడంలో కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం శూన్యం. బి.సి ల అభ్యున్నతి కోసం కాకా కలేల్కర్ కమీషన్ మొదలుకుని మండల్ కమీషన్ నివేదిక వరకు జరిగిన అన్ని పోరాటాల్లో బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బహుజన నాయకులు కీలకపాత్ర వహించారు. మండల్ కమీషన్ నివేదిక సమర్పణ అనంతరం దేశంలో జరిగిన రాజకీయ పరిణామాల వల్ల బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నాయకులు బహుజన ఉద్యమాల్లో వెనుకబడ్డారు. ప్రస్తుతం పెరియార్ వారసులైన తమిళనాడు బహుజన నాయకులతో పాటు తెలుగు రాష్ట్రాల బి.సి నాయకులు కీలకపాత్ర వహిస్తున్నారు. బి.సి ల సమస్యల సాధన కోసం, బి.సి జనగణన కోసం, బి.సి లకు విద్య, ఉద్యోగ, చట్టసభల్లో బి.సి లకు రిజర్వేషన్ల కోసం పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. రాజ్యాధికారం ద్వారానే బి.సి లకు విముక్తి జరుగుతుందనే వాదన పెరుగుతుంది. ఈ క్రమంలో కులాలుగా విడగొట్టబడిన బి.సి లు ఏకమై పార్టీలకు, సంఘాలకు అతీతంగా ఐక్యమై బి.పి మండల్ ఆదర్శంగా ముందుకు సాగాలి.

(ఆగస్టు 25 న బి.పి మండల్ 108 వ జయంతి సందర్భంగా)



...సాయిని నరేందర్,
న్యాయవాది
సామాజిక, రాజకీయ విశ్లేషకులు
9701916091

# గిరిజన హక్కుల సాధనే లక్ష్యం

## - జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించిన సర్పంచ్ లావుడ్య పూర్ణ

**లక్ష్మి దేవిపల్లి ,ఆగస్టు 24( భద్రాద్రిన్యూస్):** రేగళ్ల రెవెన్యూ పరిధిలోని గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించేందుకు పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా పూర్ణ ముందడుగు వేశారు. జాతీయ ఎస్సీ,ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్ ని కలిసి, రేగళ్ల ప్రాంత గిరిజనులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను వివరిస్తూ సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రేగళ్ల ప్రాంతంలో జరుగుతున్న దీ రోడ్ అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు, గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు, ఎస్సీ కాలనీ మరియు ఎస్టీ తండాల్లో సమాన అభివృద్ధి, కేటీపీఎస్ --నవభారత్ సంస్థల సిఎస్ఆర్ నిధుల వినియోగం తదితర అంశాలను సర్పంచ్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

**రూ.10 కోట్ల ఆర్ అండ్ బి రహదారి పనులపై విచారణకు విజ్ఞప్తి**

ప్రస్తుతం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.10 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రేగళ్ల--కరకవాగు రహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా లేదా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపించాలని సర్పంచ్ లావుడ్యా పూర్ణ కోరారు. రోడ్డు నిర్మాణ పనుల్లో నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ సామగ్రిని వినియోగించాల్సి ఉండగా, చెరువు మట్టిని ఉపయోగిస్తున్నట్లు, మట్టికి అవసరమైన ప్లాస్టిక్ ఇండెక్స్ ప్రమాణాలు పాటించడంలేదనే ఆరోపణలు ఉన్నాయని వినతిపత్రంలో పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామాల్లో నిర్మిస్తున్న సీ.సీ డ్రైనేజీలు, వాగులు,వంకల వద్ద నిర్మిస్తున్న కల్వర్టులు, ఇతర కాంక్రీట్ పనుల్లో కూడా నాణ్యతా ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఎస్టిమేట్ బి.ఓ.క్యూలో నిర్దేశించిన నిర్మాణ సామగ్రి ప్రకారం పనులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ఇసుక కు బదులుగా కేవలం క్రషర్ డస్ట్ వినియోగిస్తూ నాసిరకమైన పనులు చేస్తున్నారనే ఆరోపణలపై సంబంధిత అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని విజ్ఞప్తి చేశారు.రోడ్డు పనులకు సంబంధించిన నాణ్యతా పరీక్షలు నిర్వహించి, లోపాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

**అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వాలి**

రేగళ్ల రెవెన్యూ పరిధిలో ఎన్నో సంవత్సరాలుగా పోడు భూములను సాగు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్న అర్హులైన గిరిజన రైతులకు అటవీ హక్కుల చట్టం ప్రకారం హక్కు పత్రాలు మంజూరు చేయాలని సర్పంచ్ లావుడ్య పూర్ణ గారు కోరారు. హక్కు పత్రాలు లేకపోవడం వల్ల గిరిజన రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అర్హత కలిగిన ప్రతి రైతు దరఖాస్తును చట్ట ప్రకారం పరిశీలించి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు.

**ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాల్లో సమాన అభివృద్ధి**

రేగళ్ల ప్రాంతంలోని ఎస్సీ కాలనీ, ఎస్టీ తండాలు మరియు ఇతర గిరిజన ఆవాస ప్రాంతాల్లో అభివృద్ధి పనులు సమానంగా చేపట్టాలని సర్పంచ్ కోరారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు తదితర మౌలిక సదుపాయాలను ప్రతి ప్రాంతానికి సమానంగా అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**పరిశ్రమలలో స్థానిక గిరిజనులకు అవకాశం ఇవ్వాలి**

రేగళ్ల ప్రాంతానికి సమీపంలో ఉన్న కె.టి.పి.ఎస్ మరియు నవభారత్ సంస్థలు తమ సి.ఎస్.ఆర్ కార్యక్రమాల్లో ఈ ప్రాంతాన్ని ప్రాధాన్యతగా గుర్తించాలని కోరారు. స్థానిక గిరిజన యువతకు





ఉపాధి అవకాశాలు, నైపుణ్య శిక్షణ, విద్య, వైద్యం, తాగునీరు, పారిశుద్ధ్యం మరియు ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి సి.ఎస్.ఆర్ నిధులు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ని కోరారు.

**గిరిజనుల హక్కుల కోసం సర్పంచ్ ప్రత్యేక చొరవ**

ఈ సందర్భంగా సర్పంచ్ లావుడ్యా పూర్ణచందర్ గారు మాట్లాడుతూ, “గిరిజనుల సమస్యలు కేవలం ఒక గ్రామానికి సంబంధించినవి కావు. అవి వారి హక్కులు, వారి భవిష్యత్తుకు సంబంధించిన అంశాలు. అభివృద్ధి పనుల్లో నాణ్యత, పారదర్శకతతో పాటు అర్హులైన గిరిజనులకు చట్టబద్ధమైన హక్కులు అందేలా నిరంతరం కృషి చేస్తాను” అని తెలిపారు. రేగళ్ల ప్రాంత గిరిజనుల సమస్యలను జాతీయ స్థాయిలో పరిష్కరించాలనే ఉద్దేశంతో పెద్దతండా గ్రామ సర్పంచ్ లావుడ్యా పూర్ణచందర్ గారు స్వయంగా జాతీయ ఎస్సీ/ఎస్టీ కమిషనర్ జాటోత్ హుస్సేన్ నాయక్ గారిని కలిసి వినతిపత్రం అందించారు. గిరిజనుల హక్కులు, అభివృద్ధి మరియు సంక్షేమానికి సంబంధించిన అన్ని అంశాలపై సమగ్రంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

# మత్తుమందు లేకుండా చుక్కల మందుతో కంటి ఆపరేషన్ సక్సెస్



**భద్రాచలం, ఆగస్టు 24 (భద్రాద్రిన్యూస్ ):** మత్తుమందు లేకుండా చుక్కల మందులతో కంటి ఆపరేషన్ సక్సెస్ అయిన ఘటన భద్రాచలంలో చోటుచేసుకుంది. భద్రాచలంలో మన్యం ఏజెన్సీ ప్రాంతమైన భద్రాచలంలో నూతన వైద్య విధానంలో డాక్టర్ దుర్గా సంతోష్ వారి ఆధ్వర్యంలో కోలే దామోదర్ రావు అనే పేషెంట్ కి నూతన శాస్త్ర చికిత్స విధానంలో భాగంగా ఎటువంటి ఇంజక్షన్ లేకుండా, మత్తు ఇంజక్షన్ లేకుండా కేవలం చుక్కల మందు డ్రాప్స్ తోనే మత్తు వచ్చే విధంగా చుక్కల డ్రాప్స్ వేసి కంటి యొక్క ఆపరేషన్ ని విజయవంతంగా చేశారు. కోలే దామోదర్ రావు ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ నొప్పి లేకుండా చాలా సంతోషంగా ఆరోగ్యకరంగా ఉన్నారు. గతంలో కూడా ఒక కన్నుకి ఆపరేషన్ విజయవంతంగా ఈ యొక్క సంతోష్ ఆసుపత్రిలోనే డాక్టర్ దుర్గా సంతోష్ ఆధ్వర్యంలోనే ఆపరేషన్ చేయించుకొని ఇప్పుడు మరలా రెండో కంటికి కూడా అలాగే అదే విధంగా నూతన పద్ధతుల్లో చాలా సంతోషంగా ఆపరేషన్ విజయవంతం కావడంతో దామోదర్ చాలా ఆరోగ్యంగా ఆనందంగా ఉంది అన్నారు .ఈ యొక్క కొత్త వైద్య విధానాన్ని ప్రవేశపెట్టినందుకు మన ఏజెన్సీలో డాక్టర్ దుర్గా సంతోష్ గారికి పలువురు అభినందనలు తెలియజేయడం జరిగింది ఈ విషయం తెలిసిన స్థానికులు కూడా చాలామంది ఆశ్చర్యపోతూ ఈ కొత్త వైద్య విధానాన్ని అభినందిస్తున్నారు ఇంజక్షన్ లేకపోవడంతో కంటి ఆపరేషన్ చేయించుకోవాలంటే చాలా ధైర్యంగా ముందుకు రావచ్చు అది కూడా మన భద్రాచలంలో ఉండటం మనకు ఎంతో ఆనందదాయకమని తెలియజేశారు ఇది చాలా శుభ పరిణయం అని మన ఏజెన్సీకి ఒక గొప్ప వరం లాంటిది ఈ వైద్య విధానాన్ని స్థానికులు అందరూ ప్రజలు డాక్టర్ దుర్గా సంతోష్ గారిని అభినందిస్తున్నారు.

# జ్వరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు



**పాల్వంచ, ఆగస్టు24 ( భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, ఉల్వనూర్ పీహెచ్‌సీ పరిధిలో ఇటీవల జ్వరంతో మరణం సంభవించిన నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. తుకారం రాథోడ్ సోమవారం తుమ్మలగూడెం పీహెచ్‌సీని సందర్శించారు. ఆరోగ్య శిబిరం, ఏఎల్ఓ, డ్రై డే కార్యక్రమాలను పరిశీలించి ప్రజలు, సర్పంచ్, వైద్య సిబ్బందితో మాట్లాడారు. జ్వర కేసులపై ఇంటింటి సర్వే నిర్వహించాలని, ప్రతి కేసును క్షుణ్ణంగా పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. తీవ్ర కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు, అవసరమైతే 108 ద్వారా తరలించాలని సూచించారు. స్వల్ప జ్వర కేసులను ప్రతి నాలుగు గంటలకు పర్యవేక్షించాలని, పరిస్థితి విషమిస్తే తక్షణమే ఆస్పత్రికి తరలించాలని ఆదేశించారు. అలాగే గ్రామాల్లో ఏఎల్ఓ, డ్రై డే కార్యక్రమాలను పంచాయతీ సిబ్బంది సహకారంతో ప్రతిరోజూ నిర్వహించాలని, గర్భిణీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జ్వర కేసుల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా అప్రమత్తంగా ఉండాలని ఆశ కార్యకర్తలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు వైద్యాధికారి సిబ్బందికి సూచనలు చేశారు.

# సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా డాక్టర్ బాదావత్ రవి జన్మదిన వేడుకలు

## - జన్మదినాన్ని సేవా దినోత్సవంగా మార్చిన మిషన్ వాక్ ఫౌండేషన్

**కారేపల్లి, ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్ రాములు ):** జన్మదినం అంటే కేవలం సంబరాలు, కేక్ కటింగ్‌కు పరిమితం కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టాలనే సందేశాన్ని మిషన్ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ బాదావత్ రవి అభిమానులు చాటారు. డాక్టర్ బాదావత్ రవి జన్మదినాన్ని పురస్కరించుకుని సింగరేణి ప్రాంతంలో అభిమానులు, ఫౌండేషన్ సభ్యులు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా కారేపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఫౌండేషన్ సభ్యులు చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. రోగులకు ఆత్మీయంగా పలకరించి, వారికి మనోధైర్యాన్ని కల్పించారు. అవసరంలో ఉన్నవారికి అండగా నిలవాలనే డాక్టర్ బాదావత్ రవి సేవా స్ఫూర్తిని ఈ కార్యక్రమం ప్రతిబింబించింది.

**ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు...**

డాక్టర్ బాదావత్ రవి వైద్య రంగంలో తన వంతు సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతున్నారని ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. సమాజంలో అవసరమైన వారికి చేయూతనివ్వడం, సేవా కార్యక్రమాల ద్వారా మానవత్వాన్ని చాటడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని చేపట్టిన సేవా కార్యక్రమాలు పలువురి ప్రశంసలు అందుకున్నాయి.

ఘనంగా జన్మదిన వేడుకలు

కారేపల్లి మెయిన్ సెంటర్‌లో ఫౌండేషన్ సభ్యుడు గుగులోత్ నరేష్




ఆధ్వర్యంలో ప్రత్యేకంగా జన్మదిన వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జవాన్ దశరథ్ కేక్ కట్ చేసి డాక్టర్ బాదావత్ రవికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా సేవా కార్యక్రమాల్లో ఆయన మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు కారేపల్లి సీఐ నూనావత్ సాగర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.

# అధికారులు ప్రజల సమస్యలు త్వరగా తీర్చాలి ఎంపీడీవో..

## ప్రజావాణిలో వచ్చిన పిటిషన్ ను బాధ్యతతో పరిష్కరించాలి..




**పాల్వంచ ,ఆగస్టు24 (భద్రాద్రి న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాపాల్వంచ మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరై ప్రజల నుంచి పిటిషన్లు స్వీకరించారు. ఈ సందర్భంగా మొత్తం 17 పిటిషన్లు అందగా, శాఖల వారీగా:

హౌసింగ్ శాఖ -- 10
ఏపీఎం -- 1
విద్యుత్ శాఖ -- 2
రెవెన్యూ శాఖ -- 1
ఎంపీఓ -- 3

పిటిషన్లను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, ప్రజల సమస్యలను సకాలంలో పరిష్కరించి, పిటిషన్లను త్వరితగతిన క్లోజ్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి. రాజారావు అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి వచ్చిన ప్రతి పిటిషన్‌పై బాధ్యతతో స్పందించి, పరిష్కార వివరాలను నమోదు చేయాలని సూచించారు.

# సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు నీళ్లు ఇవ్వాలి

## – సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు

**కారేపల్లి, ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్ రాములు ):** సింగరేణి మండలానికి సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగు, తాగునీటిని అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి బాజు మల్లాయిగూడెం మాజీ సర్పంచ్, సీపీఎం సీనియర్ నాయకులు అమరజీవి కామ్రేడ్ కరపటి రాములు 13వ వర్ధంతి సభను వజ్జా రామారావు అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తయినా, రాష్ట్రాలు ఏర్పడి దశాబ్దాలు గడిచినా ఏజెన్సీ ప్రాంతంలోని సింగరేణి మండలానికి ప్రభుత్వం నిర్మిస్తున్న ప్రాజెక్టుల ద్వారా చుక్క నీరు కూడా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయమే ప్రధాన వృత్తిగా జీవిస్తున్న గిరిజన, గిరిజనేతర పేదలు వర్షాధార సాగుపైనే ఆధారపడుతున్నారని తెలిపారు. వర్షపు నీటితో నిండే చెరువులు, కుంటలు, బోర్లు, బావులు మినహా శాశ్వత నీటి వనరులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి మండలం పట్ల నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నాయని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు కాలువల కోసం సింగరేణి మండలంలోని మధ్యతరగతి, పేద రైతుల భూములను తీసుకుంటున్నప్పటికీ, 2013 భూ నిర్వాసితుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. సీతారామ కాలువలు సింగరేణి మండల భూముల మీదుగా వెళ్తున్నప్పటికీ స్థానిక రైతులకు సాగునీరు అందకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. సింగరేణి మండలానికి సాగునీరు అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, భూ సమస్యల పరిష్కారానికి కరపటి రాములు ప్రజాప్రతినిధిగా, కమ్యూనిస్టు నాయకుడిగా అనేక పోరాటాలు నిర్వహించి ప్రజల మనసు గెలుచుకున్నారని నున్న నాగేశ్వరరావు కొనియాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యపరచి, ప్రజా సమస్యలపై పోరాడటమే కరపటి రాములుకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ కార్యదర్శి భూక్య వీరభద్రం, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మెరుగు సత్యనారాయణ, జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ, కొండబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర, ప్రజానాట్యమండలి నాయకులు కరకపల్లి రాయమల్లు, మండల కమిటీ సభ్యులు సురభాగ ధనమ్మ,




యనమనగండ్ల రవిబాబు, శాఖ కార్యదర్శి సూరబాక సర్వయ్య, సోషల్ మీడియా కన్వీనర్ ధరావత్ వినోద్ కుమార్, పార్టీ సభ్యులు షేర్ వెంకటేశ్వర్లు, బచ్చల బుజ్జమ్మ, బచ్చల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కరపటి రంబాయమ్మ, భారత లక్ష్మి, బజ్జల వంశీకృష్ణ, ధరావత్ సరితతో పాటు కరపటి రాములు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కోదండరామపురం పాఠశాలలో ఘనంగా గడ్డం రుద్రాంశ్ పుట్టినరోజు వేడుకలు

## : విద్యార్థులకు స్నాక్స్, వాటర్ గ్లాసుల పంపిణీ



**కోదాడ, ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్):** కోదాడ నియోజకవర్గ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గడ్డం అంజి కుమారుడు గడ్డం రుద్రాంశ్ పుట్టినరోజు వేడుకలు మునగాల మండలం కోదండరామపురం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉదయం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలలోని ప్రాథమిక విభాగానికి చెందిన విద్యార్థులతో పాటు, అంగన్‌వాడీ కేంద్రం పిల్లలకు రుద్రాంశ్ తన చేతుల మీదుగా చాక్లెట్లు, స్నాక్స్ బాక్సులు, మరియు వాటర్ గ్లాసులను పంపిణీ చేశారు. తోటి విద్యార్థులకు ఈ కానుకలను అందజేసి, పుట్టినరోజు ఆనందాన్ని పంచుకున్నారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు కూడా స్నాక్స్ అందజేసి, వారి నుంచి రుద్రాంశ్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

# నిత్యావసర ధరల పెరుగుదలపై ఆవుల అశోక్ ఆగ్రహం

## - ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం విఫలం

**కారేపల్లి, ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్ రాములు ):** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆవుల అశోక్ అన్నారు. ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు.

కారేపల్లి, కామేపల్లి సంయుక్త మండలాల ముఖ్య కార్యకర్తల సమావేశం టేకులగూడెంలో రంగయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆవుల అశోక్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి టి. ఝాన్సీ పాల్గొని మాట్లాడారు. వంటనూనె, చక్కెర, బియ్యం, ఉప్పు, పప్పులు, కూరగాయల ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు కూడా పెరుగుతుండటంతో సామాన్య కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. ధరల నియంత్రణలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని వారు అన్నారు. పంటల దిగుబడి తగ్గడం, వాతావరణ పరిస్థితులను సాకుగా చూపుతూ ధరల పెరుగుదలను సమర్థించడం సరికాదన్నారు. కార్పొరేట్ సంస్థలు భారీగా ధాన్యాలను నిల్వ ఉంచి కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ కేంద్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు అక్రమ నిల్వలను అరికట్టి, మార్కెట్లో సరఫరాను పెంచాలని డిమాండ్ చేశారు. కారేపల్లి మండలంలో కోతుల బెడదను అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. కోతులు పంటలను నష్టపరచడంతో పాటు ఇళ్లలోకి ప్రవేశించి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లను సమయానికి పూర్తి చేసిన లబ్ధిదారులకు ఫైనల్ బిల్లులు చెల్లించకుండా పెండింగ్‌లో




ఉంచడం సరికాదన్నారు. పూర్తయిన ఇళ్లకు సంబంధించిన తుది బిల్లులను వెంటనే విడుదల చేసి పేదలకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు గుగులోతు తేజ నాయక్, మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, సహాయ కార్యదర్శి రాకేష్, భాస్కరరావు, అనుసూర్య, సరోజిని, పుల్లకాని సత్తిరెడ్డి, రావుల నాగేశ్వరరావు, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## - ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్

## - దోమలు, కలుషిత నీటితో వ్యాధులపై జాగ్రత్తలు పాటించాలి

## - శుక్రవారం పొడి దినంగా పాటిస్తూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



**కారేపల్లి, ఆగస్టు 24 (భద్రాద్రి న్యూస్ రాములు ):** వర్షాకాలంలో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ అప్రమత్తంగా ఉండాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ సూచించారు. రానున్న రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వర్షాల కారణంగా దోమల వ్యాప్తి పెరిగి మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలు ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మురుగునీటి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, నీటి నిల్వ ప్రాంతాలను గుర్తించి దోమల వృద్ధిని అరికట్టాలని తెలిపారు. తలుపులు, కిటికీలకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రాత్రి వేళల్లో నిద్రించే సమయంలో దోమతెరలను వినియోగించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రతి శుక్రవారం ఇళ్ల పరిసరాల్లో నిల్వ ఉన్న నీటిని తొలగించి 'శుక్రవారం పొడి దినం' పాటించాలని ఎమ్మెల్యే కోరారు.

**కలుషిత నీటితో అప్రమత్తంగా ఉండాలి**

వర్షాకాలంలో కలుషిత నీటి కారణంగా గ్యాస్ట్రోఎంటరైటిస్, కామెర్లు, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా వడపోసిన లేదా మరిగించిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. భోజనానికి ముందు, తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, ఎక్కువసేపు నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను తీసుకోకుండా జాగ్రత్త వహించాలని కోరారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. జ్వరం, వాంతులు, విరేచనాలు తదితర అనారోగ్య లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అధికారులు ముందస్తు చర్యలు చేపట్టి దోమల నివారణ, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఆదేశించారు.

# ఎస్ఐ గోపి చాకచక్యంతో అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

## – టెక్నాలజీ సాయంతో కేసును ఛేదించిన కారేపల్లి పోలీసులు.. తల్లిదండ్రులకు అప్పగింత

**కారేపల్లి, ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్ రాములు ):** మూడు నెలల క్రితం అదృశ్యమైన యువతి ఆచూకీని కారేపల్లి ఎస్ఐ గోపి ఆధ్వర్యంలోని పోలీసులు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గుర్తించారు. యువతిని సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించడంతో కుటుంబ సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్‌కు చెందిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఎస్ఐ గోపి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని బళ్లనగర్ తండాకు చెందిన యువతి గత మే నెలలో అదృశ్యమైంది. యువతి తల్లిదండ్రులు కారేపల్లి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయగా, పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. యువతి వద్ద మొబైల్ ఫోన్ లేకపోవడంతో ఆమె ఆచూకీ గుర్తించడం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఈ నేపథ్యంలో ఎస్ఐ గోపి ఆధ్వర్యంలో పోలీసులు అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలను వినియోగిస్తూ దర్యాప్తును ముమ్మరం చేశారు. వివిధ కోణాల్లో విచారణ చేపట్టి చివరకు యువతి ఆచూకీని గుర్తించారు. అనంతరం ఆమెను సురక్షితంగా కారేపల్లికి తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న హైదరాబాద్‌కు చెందిన రుకుమ్ అనే యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. మూడు నెలలుగా ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులకు యువతి




ఆచూకీ లభించడంతో ఊరట లభించింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా వినియోగించి కేసును ఛేదించిన కారేపల్లి పోలీసులను పలువురు అభినందించారు.

# జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలి

## - టీయూడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఖదీర్

**కారేపల్లి,ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్ రాములు ):** ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, పేదలకు న్యాయం జరిగేలా కృషి చేస్తూ, అవినీతిని ప్రశ్నించే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని టీయూడబ్ల్యూజేఎఫ్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు ఖదీర్ అన్నారు.

జర్నలిస్టులు నిరంతరం ప్రజల సమస్యలపై పనిచేస్తూ సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యలు మాత్రం చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు. ప్రభుత్వాలు మారుతున్నా జర్నలిస్టుల స్థితిగతుల్లో ఆశించిన మార్పు రావడం లేదని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం సానుకూలంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం ఒత్తిడి తీసుకురావాలనే లక్ష్యంతో టీయూడబ్ల్యూజేఎఫ్ క్షేత్రస్థాయిలో కార్యక్రమాలను విస్తరిస్తోందని తెలిపారు. గతంలో అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినట్లు చెప్పారు. అయితే జర్నలిస్టుల సమస్యలు కేవలం పట్టణ ప్రాంతాలకే పరిమితమైనవనే భావనను తొలగించి, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు.

**క్షేత్రస్థాయి జర్నలిస్టులే ఉద్యమానికి బలం**

గ్రామీణ, మండల స్థాయిలో ప్రజల సమస్యలను నిత్యం వెలుగులోకి తీసుకువస్తున్న జర్నలిస్టులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఖదీర్ తెలిపారు. వారి సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు క్షేత్రస్థాయి నుంచి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, వృత్తిపరమైన భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. యూనియన్లు, రాజకీయ పార్టీలకు అతీతంగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. వేర్వేరు సంఘాలు వేర్వేరు కార్యక్రమాలు చేపట్టినా, జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే అంతిమ లక్ష్యమని పేర్కొన్నారు. వ్యక్తిగత విభేదాలను పక్కనపెట్టి జర్నలిస్టులంతా ఐక్యంగా ముందుకు సాగితేనే హక్కులను సాధించుకోవచ్చని ఖదీర్ అన్నారు.

జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం ప్రజాస్వామ్య పద్ధతిలో చేపట్టే ఉద్యమాలకు ప్రతి జర్నలిస్టు మద్దతుగా నిలవాలని




ఆయన కోరారు. "కలిసి నడుద్దాం.. ఐక్యంగా పోరాడుదాం.. జర్నలిస్టుల హక్కులను సాధించుకుందాం" అని ఖదీర్ పిలుపునిచ్చారు.

# గుండాల నుండి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

**- ఫారెస్ట్ అనుమతుల పేరుతో జాప్యం.**
**- ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పాలకులు.**
**- తోలెం గోపి. సిపిఎం మండల నాయకులు.**

**గుండాల ఆగష్టు 24: భద్రాద్రి న్యూస్:** గుండాల నుండి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం మండల నాయకులు తోలెం గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం నాడు సిపిఎం బృందం గుండాల నుంచి రంగాపురం ప్రదాన రహదారిని పరిశీలించడం జరిగింది.సాయినపల్లి పంచాయతీ లో సిపిఎం బృందం సర్వే నిర్వహించటం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం 2006 ప్రకారం ప్రజల ఉమ్మడి హక్కు కల్పించి రహదారి నిర్మాణానికి మోక్షం కల్పించాలని డిమాండ్ చేశారు, గుండాల నుండి రంగాపురం వెళ్లే ప్రధాన రహదారి పనులు పూర్తి కాకుండా అర్ధాంతరంగా ఆగిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం వల్ల రోడ్డు పనులు ఆగిపోయాయన్నారు. మేడారం, మణుగూరు వెళ్ళటానికి ప్రయాణికులకు రోడ్డు ఉపయోగపడుతుంది.అదే విధంగా గుండాల మండల ప్రజలు నిత్యం రాకపోకలు సాగించే రహదారి. కాంట్రాక్టర్ ఫారెస్ట్ అధికారులు క్లియరెన్స్ ఇవ్వకపోవడం వల్ల పనులు ఆపేసినాము అని చెబుతున్నారు .
సుమారుగా 20 కిలోమీటర్ల మేర పనిని ఆగిపోయిన పని వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.ప్రతి సంవత్సరం మరమ్మత్తుల పేరుతో 5.లక్షల రూపాయలు మంజూరు చేయించడం అక్కడక్కడ గ్రావెల్ పోసి మిగతా డబ్బులు మాయం చేస్తున్నారని విమర్శించారు. గత పదిహేను సంవత్సరాలుగా ఇదే తంతు కొనసాగుతోందన్నారు. తక్షణమే బీటీ రోడ్డు నిర్మాణం ఫారెస్ట్ ప్రాంతంలో పూర్తి చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది, లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ



కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జోగా రాజేష్, ఉకే వెంకటేశ్వర్లు, వాగబోయిన నర్సింగరావు, వాగబోయిన పోతయ్య , కల్తీ సమ్మయ్య, ఏరం రామకృష్ణ ,జోగ రవి, దుగ్గి రామ్మూర్తి ,కల్తీ రామస్వామి, గడ్డం కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



## లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం



**వైరా, ఆగస్టు 24, (భద్రాద్రి న్యూస్ ):** వైరా నియోజకవర్గ మండల గొల్లపూడి వృద్ధుల విశ్వాస వసతి గృహం నందు లయన్ కొణతాలపల్లి నగేష్ పుష్పావతి దంపతుల పెళ్లిరోజు సందర్భంగా సోమవారం వృద్ధులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లయన్స్ సభ్యులు చింతోజు నాగేశ్వరరావు, నూకల ప్రసాద్ రావు, అధ్యక్షులు కొల్లా రాంబాబు, సెక్రెటరీ కొదుమూరి రవి లు మాట్లాడుతూ వృద్ధాశ్రమాలు ఉండటం చాలా బాధాకరమని అయినా వృద్ధులను చిన్న పిల్లలతో సమానంగా చూడాలని, వారి పట్ల ప్రేమతో సమానంగా మెలగాలని, నేటి సమాజంలో మానవియ విలువలు క్షీణించి, కొడుకులు బిడ్డలు తల్లిదండ్రులను భారంగా సూసేటువంటి రోజులు చూస్తున్నామని, ఈ విషయం చాలా బాధాకరమని, మనల్ని నవమాసాలు కని, పెంచి, పెద్ద చేసిన తల్లిదండ్రులను వారి యోగక్షేమాలను చూసే బాధ్యత కొడుకులు పై, బిడ్డలపై ఉంటుందని, తల్లిదండ్రులను గౌరవించి కంటికి రెప్పలాగా దైవంలాగా చూసే బాధ్యత నేటి సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉండాలని, వారిని ప్రేమతో చూసుకోవాలి గాని ఎలాంటి మానసిక ఇబ్బందులు పడకుండా, రాకుండా జాగ్రత్తలు చూసుకొని ఉండాలని, ప్రతి ఒక్కరిని కోరారు. అనంతరం కొణతాలపల్లి నగేష్, పుష్పావతి దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రీజన్ సెక్రెటరీ వై బుచ్చి రామారావు ఆశ్రమ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ పారిశుధ్యం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**- చలో రేపు ఖమ్మం కలెక్టరేట్ కార్యాలయం ముట్టడికి జయప్రదం చేయండి**
**- పంచాయతీ కార్మికులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ**
**- ఎంపీడీవో ధరావత్ సోమ్లాల్ ఎంపీ ఓ వి వి ఎస్ శాస్త్రి కి వినతి పత్రం అందజేయడం జరిగింది**
**- సీఐటీయూ యూనియన్ మండల కన్వీనర్ బాధావత్ శీను నాయక్ పిలుపు**

**కామేపల్లి,ఆగస్టు24 (భద్రాద్రి న్యూస్):** కామేపల్లి మండల పరిధిలో ఉన్న 24 గ్రామ పంచాయతీ లకు సంబంధించిన గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ బాదావత్ శ్రీను,వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి నరాతీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకై రేపు చేపడుతున్న జిల్లా కలెక్టరేట్ ముట్టడి' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ,వారు మండల అభివృద్ధి అధికారి సోమలాల్.ఎంపీఓ వి వి ఎస్ శాస్త్రి. టీ.నరేందర్ లకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం నెలకు రూ 25000 నిత్యవసర వస్తువుల ధరలకు అనుకూలంగా చెల్లించాలని వారు అన్నారు.పెండింగ్ లో ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. జీవో 51 ప్రకారం కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతి కార్మికుడికి రూ. 10 లక్షల ప్రమాద రహిత భీమ ఇన్సూరెన్స్ రక్షణ పరికరాలు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు




ఉపేందర్,వీరభద్రం తదితరులు పాల్గొన్నారు

## వర్షాకాల వేళ ఆరోగ్యం పై అప్రమత్తంగా ఉండండి

**- ఇంటి ముందు నీరు నిలవ ఉండకుండ, చెత్త పెరగకుండా చేయండి**
**- వైరా మున్సిపల్ చైర్పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ**



**వైరా, ఆగస్టు 24, (భద్రాద్రి న్యూస్) :** వైరా నియోజకవర్గ పట్టణ మున్సిపాలిటీ పరిధిలో వర్షాల కారణంగా ప్రజలందరూ అప్రమతతో ఉండాలని సోమవారం మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ బాబా చంద్రకళ, మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా చైర్పర్సన్ చంద్రకళ మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో వచ్చే ఏడు రోజులు తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు చూసి అవకాశం ఉన్నది, తెలంగాణ ప్రజా ఆరోగ్య శాఖ తెలిపిందని,కావున మైదా మున్సిపాలిటీ పరిధిలో ప్రజలందరూ అప్రమతతో ఉండాలని, వర్షాలతో దోమల బెడద పెరిగే అవకాశం ఉన్నందున, ఇంటి పరిసరాల్లో మీరు నిల్వ ఉండకుండా చూడాలని, కిటికీలు, తలుపులకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలని, మలేరియా, డెంగ్యూ, డయేరియా, చికెన్ గున్యా, నివారణకు ప్రతి శనివారం "డ్రై డే" పాటించి నిలువ నీటిని తొలగించాలని, డాక్టర్ చంద్రకళ సూచించారు. ద్వారా వచ్చే వ్యాధులను నివారించేందుకు కాచి చల్లార్చిన, లేదా ఫిల్టర్ చేసిన నీటిని తాగాలి అని. భోజనానికి ముందు, తరువాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలి అని, వైరల్ జ్వరాలు, ఇన్ ఫ్లూయోజా లక్షణాలు ఉంటే సమీప ప్రభుత్వ ఆసుపత్రిని సంప్రదించాలని, అత్యవసర పరిస్థితులలో 108 కు కాల్ చేయాలి అని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ప్రత్యేక పడకలు, ఐవీ ద్రవాలు, అవసరమైన మందులు సిద్ధంగా ఉంచారని, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, అంగనవాడి సిబ్బంది ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆమె తెలిపారు.

# డయాబెటిస్ ఉన్నవారు సీతాఫలం తినవచ్చా?

ఇంటర్నెట్ డెస్క్: సీతాఫలం.. తియ్యటి రుచితో ఉండే ఈ పండులో శరీరానికి అవసరమైన పలు పోషకాలు ఉంటాయి. విటమిన్-సి, విటమిన్-బి6, పీచు పదార్థం, మెగ్నీషియం, పొటాషియం, ఐరన్‌తో పాటు యాంటీఆక్సిడెంట్లు కూడా ఇందులో ఉంటాయి. సీతాఫలం తినడం వల్ల శరీరానికి కొన్ని పోషకాలు అందుతాయి. ఇందులో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియకు సహాయపడుతుంది. మలబద్ధకం వంటి సమస్యలను తగ్గించడంలో కూడా తోడ్పడవచ్చు. అయితే సీతాఫలంలో సహజ చక్కెర, కార్బోహైడ్రేట్లు కూడా ఎక్కువగా ఉంటాయి.

**మధుమేహం ఉన్నవారు సీతాఫలం తినవచ్చా?**

మధుమేహం ఉన్నవారికి సీతాఫలం తినాలా వద్దా అనే సందేహం సాధారణంగా ఉంటుంది. సీతాఫలం గ్లైసెమిక్ ఇండెక్స్ సుమారు 54--55 మధ్య ఉంటుందని చెబుతారు. అంటే ఇది రక్తంలో చక్కెర స్థాయిలపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే మధుమేహం ఉన్నవారు సీతాఫలాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం ఉందని చెప్పలేం. అయితే మితంగా తీసుకోవడం ముఖ్యం. ఒకేసారి ఎక్కువ మొత్తంలో తినకుండా పరిమిత పరిమాణంలో తీసుకోవడం మంచిది.

**ఎంత మోతాదులో తినాలి?**

మధుమేహం ఉన్నవారు సీతాఫలాన్ని తినేటప్పుడు పరిమాణంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ఒకేసారి రెండు సీతాఫలాలు తినడం కంటే తక్కువ మోతాదులో తీసుకోవడం మంచిది. అలాగే ఆ రోజులో తీసుకునే ఇతర కార్బోహైడ్రేట్లను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. సీతాఫలాన్ని ఎక్కువగా తింటే ఇందులోని కార్బోహైడ్రేట్లు, సహజ చక్కెర కారణంగా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు పెరగవచ్చు. అధికంగా తినడం వల్ల అదనపు కేలరీలు చేరి బరువు




పెరగడానికి కూడా అవకాశం ఉంటుంది.

# నడక, శ్వాస.. కలగలిసి...

నడక, శ్వాస.. కలగలిసి...సోషల్ మీడియాలో ఈమధ్య 'తాయ్ చి వాకింగ్' రీల్స్, వీడియోలూ బాగా ట్రెండ్ అవుతున్నాయి. సులభమైన, తక్కువ శ్రమతో కూడిన ఈ వ్యాయామం శరీరానికీ, మనసుకూ మేలు చేస్తుందంటున్నారు.

'తాయ్ చి' అనేది చైనీస్ యుద్ధ కళ. దీని సూత్రాల ఆధారంగా చేసే మైండ్‌ఫుల్ నడక 'తాయ్ చి వాకింగ్'. చాలా నెమ్మదిగా, ప్రతీ అడుగునూ గమనిస్తూ నడవడం దీని ప్రత్యేకత. ఇందులో శ్వాస, సమతుల్యత, శరీరంపై పూర్తి స్పృహ ముఖ్యం. ఎక్కడైనా, ఎవరైనా వయసుతో సంబంధం లేకుండా దీనిని సాధన చేయొచ్చు. సరళంగా ఉంటూనే ఎక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఇస్తోందని, ఒత్తిడితో బాధపడేవారు దీనికి ఆకర్షితులవుతున్నారు. సాధన చేస్తున్నారు.

ఒత్తిడికి గురైనప్పుడు కాసేపు వాకింగ్ చేయాలని పెద్దలు సూచిస్తుంటారు. ఇంటి చుట్టూ చిన్న నడక కావొచ్చు, దగ్గర్లోని పార్కుకు వెళ్లి ప్రశాంతంగా వాకింగ్ చేయడం కావొచ్చు. మొత్తమ్మీద నడక వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయని తాయ్ చి ట్రెండ్ చాటుతోంది. "రోజంతా స్క్రీన్ ముందే ఉండటం వల్ల విపరీతమైన మెడ, నడుము నొప్పులుండేవి. దీంతో తాయ్ చి నడక ట్రై చేశా. రోజూ సాయంత్రం 15-20 నిమిషాలు శ్వాసపై దృష్టిపెడుతూ చేసే ఈ నడక నా మైండ్‌ను రిఫ్రెష్ చేస్తోంది. రాత్రివేళల్లో నిద్ర కూడా బాగా పడుతోంది" అంటూ ఐటీ ఉద్యోగులు తమ అనుభవాలను సోషల్‌మీడియాలో పంచుకుంటున్నారు.

**ఇదీ నడిచే విధానం...**

'తాయ్ చి వాకింగ్' సాధారణ నడకలాంటిది కాదు... దీనికి కొన్ని పద్ధతులున్నాయి. అడుగు వేసేటప్పుడు ముందుగా మడమను (హీల్) నేలపై మోపి, తర్వాత నెమ్మదిగా పాదాన్ని నేలకు ఆన్చాలి. ఇక కాలుపై శరీరపు బరువును పూర్తిగా మోపాకే మరో కాలును ముందుకు వేయాలి. వెన్నెముక తిన్నగా ఉంచి, చేతులను స్వేచ్ఛగా ఊపుతూ శ్వాసపై దృష్టి పెట్టాలి. ఈ విధానంలో నెమ్మదిగా, ఉద్దేశపూర్వకంగా కదులుతూ బరువును పూర్తిగా ఒక కాలు నుంచి మరో కాలుకు ఎలా బదిలీ చేయాలో నేర్చుకుంటారు. అంటే 'బరువైన పాదం, తేలికైన పాదం' అవగాహన దీనిలో ముఖ్యం.

"మీ బరువును మోసే బరువైన పాదానికీ, స్వేచ్ఛగా కదలగలిగే తేలికైన పాదానికీ మధ్య ఉన్న స్పష్టమైన వ్యత్యాసాన్ని గమనిస్తూ నెమ్మదిగా నడక కొనసాగించాలి" అంటారు తాయ్ చి మాస్టర్, 'ద ఫైవ్ సీజన్స్ మెథడ్' రచయిత్రీ లెడా ఇలియట్. "మనం ప్రతీ అడుగునూ అవగాహనతో, ఉద్దేశపూర్వకంగా వేసినప్పుడు అర్థవంతమైన మార్గాన్ని సృష్టించుకుంటాం. ఈ విధంగా తాయ్ చి నడక మన జీవితాన్ని ప్రతిబింబిస్తుంది. ఇది సురక్షితమైనదే. అయితే ప్రారంభ దశలో ఉన్నవారు ఒకేసారి ఎక్కువగా చేయకుండా జాగ్రత్త తీసుకోవాలి" అని సూచిస్తారామె.

**ప్రయోజనాలివి...**

కాళ్లపై ఒత్తిడి పడకుండా నడుస్తారు కాబట్టి మోకాళ్ల నొప్పులు, కీళ్ల వాతం ఉన్నవారికి ఉపశమనంగా ఉంటుంది.

ఈ నడకతో కండరాల బలం పెరగడం వల్ల.. వయసు మళ్లినవారు అదుపు తప్పి కిందపడిపోయే ప్రమాదం తగ్గుతుంది.

నడకకు ధ్యానం జత చేరడం వల్ల మానసిక ఒత్తిడీ, ఆందోళన తగ్గి నాడీ వ్యవస్థ మెరుగవుతుంది.

వెన్నెముకను నిటారుగా ఉంచి నడవడం వల్ల శరీర భంగిమ మెరుగుపడి, నడుము నొప్పులు తగ్గుతాయి.

తక్కువ శ్రమతో శరీరమంతటా రక్తప్రసరణ సరిగ్గా జరుగుతుంది.

**వీడియోలు శోధిస్తున్నారు...**



గూగుల్, సోషల్‌మీడియా వేదికల్లో ఇటీవల 'స్లో ఫిట్‌నెస్', 'తాయ్‌చి వాకింగ్ ఫర్ సీనియర్స్' అనే సమాచారం కోసం వెదుకుతున్న వారి సంఖ్య 40 శాతానికి పైగా పెరిగింది. రోజూ 20 నిమిషాల ధ్యానపూర్వక నడక వల్ల శరీరంలో ఒత్తిడి హార్మోన్ కార్టిసాల్ స్థాయిలో 20-25 శాతం తగ్గుదల కనిపిస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. భారతీయ ఆయుష్, వెల్‌నెస్ రంగాలు కూడా ఆక్యుప్రెజర్, యోగాలతో పాటు 'జెంటిల్ మూవ్‌మెంట్ థెరపీ' కింద తాయ్ చి సూత్రాలను చేరుస్తున్నాయి. "తాయ్ చిపై అ?ధ్యయనాలు ఇంకా విస్తృతంగా జరగాల్సివుంది. అయితే ఇప్పటికే జరిగిన పరిశోధనల్లో... చాలామంది వయోధికుల్లో సమతుల్యత, క్రియాత్మక చలనశీలత, జీవన నాణ్యతలో మెరుగుదల కనిపిస్తోంది" అంటారు న్యూయార్క్ మౌంట్‌సినాయ్ ఇంటర్నల్ మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రిస్టఫర్ గోల్డ్. ఏదేమైనా నడకకు సంబంధించిన సురక్షితమైన మార్గం కాబట్టి... ఈ కొత్తరకం నడక పట్ల అందరికీ ఆసక్తి పెరుగుతోంది. ఫిట్‌నెస్‌తోపాటు ఏకాగ్రత, ప్రశాంతతలపై కూడా దృష్టి పెట్టడం 'తాయ్ చి' నడక ప్రత్యేకత. ఇతర వ్యాయా మాల్లాగా వేగంగా కదలాల్సిన అవసరం ఉండదు. ఒక కదలిక నుంచి మరో కదలికకు మృదువుగా మారడం దీని లక్షణాల్లో ఒకటి.

## వరి పంట వేసిన రైతులు సోదరులు బోనస్ కోసం ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోండి



**కామేపల్లి,ఆగస్టు 24(భద్రాద్రి న్యూస్):-** కామేపల్లి మండలం పరిధిలోని వరి పంట సాగు చేస్తున్న వ్యవసాయ రైతు సోదరులు బోనస్ కోసం తమ దరఖాస్తు ఆన్లైన్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి తార దేవి విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓ ప్రకటన విడుదల చేశారు.కామేపల్లి మండల రైతులు ప్రభుత్వం చెప్పిన వరి రకాలు 1.బిపిటి 5204 2. ఆర్ఎన్ఆర్ 15048 3.హెచ్ఎంటి సోనా 4.వరంగల్ 44(సిద్ది )5. కేఎన్ఎమ్ 1638 6. కేఎన్ఎమ్ 7715 7. జై శ్రీరామ్ రకాలు రైతులు ఎవరి విత్తన దుకాణంలో కొనుగోలు చేశారో ఆ విత్తన షాప్ దగ్గరకు వెళ్లి మీరు కొన్న రసీదు చూపి వారితో ఆన్లైన్ చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆన్లైన్ చేసుకున్న రైతులకు మాత్రమే ప్రభుత్వం ఇచ్చే బోనస్ వర్తిస్తుందని తెలిపారు.కొందరు రైతులు వారి సొంత వడ్లనే వేసుకొనే వారు ఇతర రైతుల వద్ద కొనుగోలు చేసిన వారు బయట జిల్లాలో కొనుకున్న వారు 4) కె.వి.కె ల వద్ద కొనుకున్న వారు విత్తన షాప్ ల వద్ద కాకుండా మరి ఇచ్చే ఎక్కడ ఎక్కడైనా కొనుగోలు చేసిన రైతులు బిల్ లేకుండా ఉంటే 7 రకాలు వేసిన వారు మాత్రమే సెల్ఫ్ డిక్లరేషన్ 100 రూపాయల బాండ్ పేపర్ మీద రాసి, రైతుల పాసుబుక్, ఆధార్ కార్డు జత పరిచి ఆయా ప్రాంతాల ఏ ఈ ఓ లకులకు ఇవ్వాలని వారు ఆన్లైన్ చేస్తారని తెలిపారు. కామేపల్లి మండలంలో పంట 7 రకాలు వేసిన రైతులు ఈ నెల 30 తారీకు వరకు గడువు ఉందని వెల్లడించారు.

Printed, Published and Owned by CHENGAPONGUSAIDULU,and printed at KAKATI BABU PRINTERS H No.4-10.Telagarama varam,Laximidevipally, Kothagudem -507101,Dist .Bhadradri kothagudem, Telangana. And Published At HNo. DA-416,Babu camp,chunchupalli (M), Kothagudem-507101,Dist Bhadradri kothagudem, Telangana.Editor: CHENGAPONGU SAIDULU. RNI TELTEL 2023/90682Call No.6302329046